


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 30-07-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 278 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## రిజర్వేషన్లపై ఎట్టి పరిస్థితిలోనూ

# ‘కాపు’ కాస్తాం

- స్వార్థరాజకీయాలతో కొందరు నీరుగార్చారు
- బడ్జెట్‌లో 2 వేల కోట్లు కేటాయించాం
- మేనిఫెస్టోకు కట్టుబడి ఉన్నాం
- సీఎం జగన్ మోహన్ రెడ్డి



అమరావతి: కాపు రిజర్వేషన్ల అంశాన్ని తెలుగుదేశం పార్టీ తన స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవడానికి ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు తీసుకున్న చర్యల వల్ల ఇవాళ కాపులు బీసీలా? ఓసీలా? అన్న పరిస్థితి తలెత్తిందని ఆయన వ్యాఖ్యానించారు. వైఎస్సార్ సీపీ కాపు ప్రజా ప్రతినిధులు (మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు) సోమవారం ముఖ్యమంత్రిని అసెంబ్లీ ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా కాపు రిజర్వేషన్ల అంశంపై తాజా పరిణామాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. కాపు రిజర్వేషన్ల అంశంపై సీఎం జగన్ మాట్లాడుతూ.. కాపుల రిజర్వేషన్ల విషయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పులేదని, మేనిఫెస్టోలో చెప్పినదానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కాపు రిజర్వేషన్లపై మంజునాథ్ కమిషన్ ఇచ్చిన నివేదికను పరిశీలించాల్సిందిగా పార్టీ నేతలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, అంబటి రాంబాబు, కురసాల కన్నబాబుకు సూచించారు.

ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ... కాపులను బీసీల్లో చేరుస్తూ 2017లో చంద్రబాబు నాయుడు కేంద్రానికి లేఖ పంపారు. తర్వాత ఈబీసీల్లో కాపులకు 5శాతం రిజర్వేషన్లు ఇస్తూ మరొక లేఖ రాశారు. అసలు కాపులను బీసీల్లో చేరుస్తూ ఇంతుకు ముందు పంపిన తరువాయి 2లో..

## అజాత శతృవు అమర్ రహే!!

- విలువల నేత జైపాల్ రెడ్డి
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి
- కన్నీటి పర్యంతమైన రాజకీయ మిత్రులు
- హాజరైన పలువురు ప్రముఖులు



హైదరాబాద్: కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత జైపాల్ రెడ్డి అంత్యక్రియలు ముగిశాయి. నెక్లెస్ రోడ్డులోని పీవీ ఘాట్ సమీపంలో ఆయన అంతిమ సంస్కారాలను ప్రభుత్వ అధికార లాంఛనాలతో పూర్తి చేశారు. విలువల నేతగా ప్రజల హృద యాల్లో చెరగని ముద్ర వేసుకున్న జైపాల్ రెడ్డి పార్థివ దేహానికి ఆయన పెద్ద కుమారుడు అరవింద్ రెడ్డి అంతిమ సంస్కారాలు నిర్వహిం చారు. జైపాల్‌ను కడసారి చూసేందుకు పలువురు ప్రముఖులు తరలి రావడంతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కర్ణాటక సీఎల్పీ నేత్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, కర్ణాటక మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్ జైపాల్ రెడ్డి పాడె మోశారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచిన జైపాల్ రెడ్డి పార్థివ తరువాయి 2లో..



## మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ కన్నుమూత



హైదరాబాద్: మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ముఖేశ్‌గౌడ్ (60) కన్నుమూశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం ఆదివారం రాత్రి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆయనన్ను జూబ్లీహిల్స్ తరువాయి 2లో..

## రాష్ట్ర ఆస్తులు ధారాదత్తం చేస్తామంటే

# ఊరుకునేది లేదు

**బందరు పోర్టుపై తెరవెనుక ప్రయత్నాలు**

**తెదేపా అధినేత చంద్రబాబు**



అమరావతి: బందరు పోర్టును తెలంగాణకు అప్పగించేందుకు వైకాపా ప్రయత్నం చేస్తోందని తెదేపా అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. పోర్టును తెలంగాణకు అప్పగించే ప్రయత్నాలు తెర వెనుక జరుగుతూనే ఉన్నాయని ఆయన ఆరోపించారు. బందరు పోర్టును ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేస్తుంటే.. తరువాయి 2లో..

## ద్రవ్యవినిమయ బిల్లుతో

# రాజన్న రాజ్యం ఖాయం

### ఏపీఐఐసీ చైర్మన్ ఆర్కే రోజా



అమరావతి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తన మొదటి బడ్జెట్‌లోని ప్రతి రూపాయిని ప్రజలకు అందించేలా చర్యలు తీసుకుందని, ప్రజా సంక్షేమమే ప్రాధాన్యంగా రూపొందిన ఈ బడ్జెట్‌కు సంబంధించిన ద్రవ్యవినిమయ బిల్లును మనసాక్షి కలిగిన ఎవరూ వ్యతిరేకించబోరని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఏపీఐఐసీ చైర్మన్ ఆర్కే రోజా స్పష్టం చేశారు. ద్రవ్య వినిమయ బిల్లుపై అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి.. ప్రజా పథకాలను ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని అభినందించారు.

*మళ్లీ రాజన్న రాజ్యం..*

పదేళ్ల కిందట దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అకాల మృతి గురించి ప్రస్తావిస్తూ ఎమ్మెల్యే రోజా ఉద్వేగంగా మాట్లాడారు. దేశం గర్వించే పథకాలను ప్రవేశపెట్టి.. తెలుగువాడి పాలనా దక్షతను చాటిన వైఎస్సార్ కోట్లాది ప్రజల మధ్య నుంచి ఆకస్మికంగా కనుమరుగైపోయారని, తాను ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి పేదవాడికీ అందుతున్నాయో? లేదా తెలుసుకోవడానికి వెళ్లి.. అంతర్ధానమయ్యారని, ఆయన మృతితో తమ భవిష్యత్తు కూలిపోయిందని తెలుగు ప్రజలు కుమిలిపోయారని అన్నారు. అన్నం పెట్టిన రాజన్న, చదువు చెప్పిన రాజన్న, ఆరోగ్యాన్ని ఇచ్చిన రాజన్న ఇకలేరని తెలిసి తెలుగు ప్రజలు గుండెలవిసేలా తరువాయి 2లో..




## ఏపీలో ఏడుగురు ఐపీఎస్ అధికారుల బదిలీ

**సంచలన కేసులను చేధించిన సిబ్బందికి అవార్డులు!**

**ఏపీ రాష్ట్ర డీజీపీ గౌతం సవాంగ్**



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఏడుగురు ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీచేసింది. బదిలీ అయిన వారు.. నర్సీపట్నం ఏఎస్పీగా రిషాంత్ రెడ్డి, రంపచోడవరం ఓఎస్డీగా ఆరిఫ్ హఫీజ్, రంపచోడవరం ఏఎస్పీగా వకుల్ జిందాలు ఉన్నారు. వీరితో పాటు గ్రేహౌండ్స్ స్క్వాడ్రన్ కమాండర్‌గా రాహుల్ దేవ్ సింగ్, విశాఖపట్నం అదనపు ఏఎస్పీ అడ్మిన్‌గా అజితా వేజెండ్ల, బొబ్బిలి ఏఎస్పీ గ్రేడ్‌వన్‌గా గౌతమి శాలిని, పార్వతీపురం ఏఎస్పీ గ్రేడ్ వన్‌గా సుమిత్ సునీల్ బదిలీ అయ్యారు.

సంచలన కేసులను చేధించిన

***సిబ్బందికి అవార్డులు!***

***ఏపీ రాష్ట్ర డీజీపీ గౌతం సవాంగ్***

విధుల్లో అప్రమత్తంగా ఉంటూ తరువాయి 2లో..



# ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నిర్లక్ష్యం తగదు

**- పిహెచ్‌సిని పరిశీలించిన సిపిఎం నేతలు**



దేవరాపల్లి : నిత్యం పేదలకు వైద్య సేవలందించే ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నిర్లక్ష్యం తగదని సిపిఎం నాయకులు ప్రశ్నించారు. దేవరాపల్లి పిహెచ్‌సిని సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి డి .వెంకన్న ,జె .సన్నిబాబు, ఎర్రునాయుడు పరిశీలించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేయి రూపాయలు దాటితే మొత్తం వైద్య ఖర్చులు కార్పొరేట్ భరిస్తుందని చెప్పిన జగన్ ప్రభుత్వ కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టి ప్రభుత్వ ఆసుపత్రులను నిర్వీర్యం చేయడమేనని వెంకన్న అగ్రహం వ్యక్తం చేశారు. పిహెచ్‌సి గదులన్నీ వర్షంతో తడిసి ... ప్రస్తుతం ఎపిడమిక్ సీజన్ ప్రారంభమై ,రోగుల సంఖ్య పెరుగ`తున్న కారణంగా వైద్య సిబ్బంది అందు బాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# పోడు భూమి సాగు రైతులకు వెంటనే పట్టాలు ఇవ్వాలి

## సిపిఎం నాయకులు అనంతగిరి మాజీ ఎంపీటీసీ దీసరి గంగరాజు



అనంతగిరి : మండలంలోని లుంగపర్తి పంచాయతీ పరిధిలో గల వెలగవపాడు గ్రామంలో 25 కుటుంబాలు వంతేనాగరు గ్రామంలో 8 కుటంబాలు, చిరకాలం నుంచి పోడు భూముల సాగు చేసుకుని జీవనోపాధి చేసుకుంటున్నారు పోడు భూమి సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యాన సోమ వారం మండలపరిషత్ కార్యాలయంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు ఈకార్యక్రమంలో అనంతగిరి మాజీ ఎంపిటిసి డి గంగరాజు వేంగడ మాజీ సర్పంచ్ ఎస్ కొండలరావు కార్య కర్తలు నాగులు బీమన్న గ్రామ స్తులు పాల్గొన్నారు,

# స్పందనకు 24 పిటీషన్లు : ఆర్డీవో గోవిందరావు



నర్సీపట్నం : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం 24 పిటిషన్లు వచ్చాయి. పలు ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు ఆర్డీవో కార్యాలయానికి వచ్చి వారి సమస్యలను, వినతులను విన్నవించుకొన్నారు. ప్రతి ఒక్కరి సమస్యలను సావధానంగా విని, వారి సమస్యల తీవ్రతను బట్టి పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. సోమవారం అధిక సంఖ్యలో భూసంబంధిత సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో గోవిందరావు మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, కాలపరిమితికి లోబడి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి దరఖాస్తును స్కాన్ చేసి ఆన్లైన్ ద్వారా సంబంధిత మండలాలకు పరిష్కార నిమిత్తం పంపడం జరుగుతుందన్నారు. స్పందన కార్యక్రమం మొదలై ఇప్పటికి నాలుగు వారాలు పూర్తయ్యాయని, ప్రతి రోజు మండల అధికారులతో స్పందన పై సమీక్షించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు స్పందన కార్యక్రమం ద్వారా నర్సీపట్నం డివిజన్ పరిధిలో గల 10 మండలాలలో 733 దరఖాస్తులు రాగా, వాటిలో 575 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందని, 158 వివిధ కారణాలతో పెండింగ్లో ఉన్నాయన్నారు. స్పందన కార్యక్రమానికి డివిజనల్ పంచాయతీ అధికారి శిరీషారాణి, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేంద్రప్రసాద్, సిడిపిఒ రమణి ఇతర అధికారులు పాల్గొన్నారు.



**అపూర్వ ఆత్మీయ కలయిక బోయపాలెం జంక్షన్ అశోక్ జైన్ గెస్ట్‌హౌస్ నందు దాసు వారి అతరాల వారసులు అందరూ ఒకే చోట కలయిక సమావేశ కార్యక్రమానికి కెయన్‌ఆర్.చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు, వైఎస్సార్ పార్టీ నాయకులు ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో దాసు నారాయణరావు, దాసు వెంకటేష్, దాసు సూర్యనారాయణ, గుప్త, దాసు సత్యనారాయణరాజు, దాసు విజయకుమార్, దాసు రాజీవ్, దాసు అనిత తదితరులు పాల్గొన్నారు.**

# వర్షాలకు అధ్వాన్నంగా రహదారులు



నర్సీపట్నం : నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నర్సీపట్నం మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ప్రధానంగా శారదానగర్‌లో కంకర రోడ్డు, బురదగా మారాయి. గోతుల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు సిమెంట్ రోడ్డు గోతులుగా తయారైంది. ప్రశాంతి నగర్, వెంకునాయుడుపేట తదితర ప్రాంతాల్లో సైతం వర్షం రోడ్లు మరింత దారుణంగా తయారయ్యాయి.

# వారంరోజుల్లో త్రాగునీరు పాఠశాల విద్యార్థులకు అందించాలని ఎఈఈ అప్పలనాయుడుకు సూచన

## గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీ



అనంతగిరి : మండల కేంద్రం అనంతగిరి బాలికల2 లో సమస్యల పై అరకు గిరి జన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళి పరిశీలింఆరు వారం రోజుల్లోగా త్రాగునీరు పాఠశాల విద్యార్థులకు అందించాలని, అసిస్టెంట్ ఇంజనీరు అప్పలనాయుడు కు సూచించారు. కోటి తో నిర్మిస్తున్న అదనపు తరగతుల గదులను పరిశీలించి తొందరగా అందించాలని బాలికలు వసతి గురించి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని ఆయన అన్నారు.

# పంటల బీమాను రైతులు వినియోగించుకోవాలి

కోటవురట్ల : ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని ప్రతీ రైతు వినియోగించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి సోమశేఖర్ కోరారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఖరీప్ పంలకు ప్రతీ రైతు బీమా చేయించుకోవాలన్నారు. వరి పంటకు వచ్చే నెల 21వ తేదీ వరకు గడువు ఉందని, చెరకు కార్శి, మొక్కజన్న, రాగులు, మినుములు, గంట్లు, వేరుశెనగ, కంది పంటలకు మాత్రం ఈ నెలాఖరులోగా చేయించుకోవాలని సూచించారు. బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకునే రైతులకు పంట బీమా అమలవుతుందని, ఏ పంట కోసం రుణం తీసుకుంటే అదే పంట సాగు చేస్తేనే బీమా వర్తిస్తుందన్నారు. బ్యాంకులో ఒక పంటకు రుణం తీసుకుని వేరే పంటను చేపడితే నష్టపోతారన్నారు. రైతులు ఇది గుర్తించాలని కోరారు. వరి పంటను గ్రామ యూనిట్‌గాను, చెరకు, రాగులు, వేరుశెనగ పంటలను మండల యూనిట్‌గా, మొక్కజన్న, కంది పంటలను జిల్లా యూనిట్‌గా పరిగణిస్తారని తెలిపారు. బీమా పథకంలో చేరగోరు రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, పంట వేసినట్లు వ్యవసాయాధికారి నుచి సాగు ధృవీకరణ పత్రంతో మీ సేవా కేంద్రాలలో ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు.

# 5 నుంచి గ్రామ వలంటీర్లకు శిక్షణ తరగతులు

## ఎంపిడిఒ యాదగిరీశ్వరరావు

నాతవరం : ఆగస్టు నెల 5 నుంచి 10వ తేదీ వరకు ఎంపికైన గ్రామ వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఇవ్వనున్నట్లు నాతవరం ఎంపిడిఒ యాదగిరీశ్వరరావు తెలిపారు. మండలంలో వలంటీర్ పోస్టులకు ఆన్‌లైన్‌లో 1568 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ నెల 11 నుంచి నిర్వహించిన ఇంటర్వ్యూలకు 1110 మంది హాజరయ్యారన్నారు. వీరి ఎంపిక ప్రభుత్వం నియమించిన ద్విసభ్య కమిటీ సభ్యుల ద్విసభ్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిబంధనల ప్రకారం ఉంటుందన్నారు. దీనిలో భాగంలోనే మండలంలో ఎంపిక చేసిన ఎనిమిది మంది ఉపాధ్యాయులకు సామర్లకోటలో ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. తర్వాత వారు మండలంలో ఎంపికైన వలంటీర్లకు శిక్షణ ఇస్తారని చెప్పారు.

# నేడు మహిళా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

యలమంచిలి రూరల్ : మహిళా పోలీసు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా యలమంచిలిలోని వాసవీ కల్యాణ మండపంలో జరిగే ఇంటర్వ్యూలకు 30న హాజరు కావాలని యలమంచిలి సిఐ నారాయణరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాంబిల్లి, యలమంచిలి పట్టణం, యలమంచిలి గ్రామీణం, అచ్యుతాపురం మండలాలకు చెందిన అభ్యర్థులంతా ఉదయం 9 గంటలకు తమ దృవపత్రాలు, ఆధార్ కార్డులు తీసుకొని రావాలని సూచించారు.

# సుందర నగరం మన లక్ష్యం

## జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్



విజయనగరం: జిల్లాలో 24లక్షల మంది జనాభా ఉన్నారని ఒక్కొక్కరు ఒక్కోమొక్క నాటి సుందరవనంగా తీర్చిదిద్దాలని, వేసిన మొక్కను సంరక్షించి దానిని భావితరాలకు అందించిన వారికి లక్కీ డ్రా ద్వారా బంగారు నాణం బహూకరిస్తామని జిల్లా కలోక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ అన్నారు. శనివారం మహిళలతో ప్రత్యేక సమావేశాన్ని ఒక ప్రవేటుహెూటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దచెరువును సుందరీకరించటమే కాకుండా సౌషదమొక్కల పెంపకం కూడా చేపడుతామన్నారు. వాకింగ్ ట్రాక్, బోటు సౌకర్యం, ల్యాండ్ స్కేపింగ్ కలుగజేస్తా మన్నారు. అలాగే శిల్పారామం, రాక్ గార్డెన్, స్థానిక విజ్జీ, రాజీవ్ స్టేడియంలను అభివృద్ధి పరిచి వంద సెటిల్ బాట్మింటెన్ కోర్టులు నిర్మిస్తామన్నారు. ఆ దశలోనే 14 పార్కులను, 88 టాంకులను ఆధునీకరించి అందమైన నగరంగా అందిస్తామన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

# అజాత శతృవు అమర్ రహే!!

దేహాన్ని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం నుంచి సోమవారం ప్రజల సందర్శనార్థం గాంధీభవన్‌కు తరలించారు. అక్కడి నుంచి అంతిమయాత్రగా నెక్లెస్ రోడ్డులోని పీవీ ఘాట్ వద్దకు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నేతలు గులాం నబీ ఆజాద్, మల్లిఖార్జున ఖర్గే, సిద్ధరామయ్య, రమేశ్ కుమార్, జానారెడ్డి, భట్టి విక్రమార్క, రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వీహెచ్, గీతారెడ్డి, మర్రి శశిధర్ రెడ్డి, పొన్నాల, శ్రీధర్‌బాబు, నంది ఎల్లయ్య, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జీవన్ రెడ్డి, సంపత్‌కుమార్, సీతక్క, గూడూరు నారాయణ రెడ్డి, తెరాస ఎంపీ కేకే, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, తీగల కృష్ణారెడ్డి, తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ నేతి విద్యాసాగర్, తెరాస నేతలు హరీశ్‌రావు, గుత్తా సుఖేందర్ రెడ్డి, డి.శ్రీనివాస్, భాజపా నేతలు చింతల రామచంద్రారెడ్డి, డీకే అరుణ, తెదేపా నేత నన్నపనేని రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ సంతాప సందేశం

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జైపాల్ రెడ్డి మృతికి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. సంతాప సందేశాన్ని జైపాల్ రెడ్డి సతీమణి లక్ష్మీకి మన్మోహన్ పంపారు.

జైపాల్‌ను తలుచుకుని

కంటతడిపెట్టిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డిహైదరాబాద్‌లో కన్నుమూసిన విషయాన్ని తలుచుకుంటూ రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు కంటతడి పెట్టారు. రాజ్యసభలో జైపాల్‌కు నివాళులు అర్పిస్తూ ఆయనతో తనకున్న అనుబంధాన్ని వెంకయ్యనాయుడు గుర్తుచేసుకున్నారు. ఓ దశలో భావోద్వేగానికి గురయ్యారు.

'ఆయన గొప్ప వ్యక్తి, పాలనాదక్షుడు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో రెండు పర్యాయాలు ఆయనతో కలిసి పనిచేసే అదృష్టం నాకు దక్కింది. మేమిద్దరం ఒకే బెంచ్‌పై కూర్చునే వారం. ప్రజాసమస్యలపై మేమిద్దరూ ఎవరి పద్ధతిలో వారు వాదన చేసే వాళ్లం' అని జైపాల్‌తో 40 ఏళ్లుగా తనకున్న అనుబంధాన్ని వెంకయ్యనాయుడు వివరించారు. జైపాల్ తనకు మంచి మిత్రుడే కాకుండా, సీనియర్ అని, ఆయన తనకు మార్గదర్శకం చేసేవారని అన్నారు. ఆయన కుంటే తాను ఆరేళ్లు చిన్నవాడినని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ సెషన్లకు ముందు బ్రేక్‌ఫాస్ట్ సమయంలో తాము తరచు కలుసుకునే వారమని ఆ రోజులను వెంకయ్యనాయుడు గుర్తు చేసుకున్నారు.

# రిజర్వేషన్లపై ఎట్టి పరిస్థితిలోనూ 'కాపు' కాస్తాం

బిల్లు పరిశీలనలో ఉంచదలచుకున్నారా? దానికి కట్టుబడి ఉన్నారా? లేక ఉపసంహరించాలనుకుంటున్నారా? దీనిపై వెంటనే సమాధానం ఇవ్వాలని చంద్రబాబు సర్కార్‌ను కేంద్రం కోరింది. దీనిపై ఈ ఏడాది ఏప్రిల్ 4న కేంద్రం రాసిన లేఖకు చంద్రబాబు సమాధానం పంపలేదు. పేదరికం ప్రాతిపదికగా ఓసీల్లో పేదలకు ఈ పదిశాతం రిజర్వేషన్లు ఇచ్చారు. దాంట్లో కులాన్ని ప్రాతిపదికగా తీసుకునే అవకాశమే లేదు. కులాల పరంగా విభజించే హక్కులేదని తెలిసి కూడా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఎలా ఇచ్చారు?.

చంద్రబాబు కాపులను బీసీల్లో చేర్చడంపైనా, ఈసీబీల్లో ఇచ్చిన 5శాతం కోటాలపైనా న్యాయస్థానాల్లో కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అడుగు ముందుకు వస్తే ఈ కోట కింద సీట్లు, ఉద్యోగాలు పొందినవారి పరిస్థితి ఏమవుతుంది?. ఈబీసీ కోటాలో కాపులకు తాను ఇచ్చిన 5శాతం రిజర్వేషన్లు వాస్తవమే అయితే ఈ ఏడాది వైద్య, పీజీ సీట్లలో చంద్రబాబు సర్కార్ ఎందుకు అమలు చేయలేదు?. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో కూడా ఇదే పేర్కొన్నారు కదా?. పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకమైతే ఎవరు బాధ్యత వహిస్తారు?. ఓబీసీ జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే...అందులో కాపుల జనాభా యాభైశాతం కన్నా ఎక్కువే ఉంది కదా?. అలాంటప్పుడు దాన్ని 5శాతానికే కట్టడి చేస్తే వారికి అన్యాయం జరగదా?.

ఈబీసీల్లో పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసింది. దానికి విరుద్ధంగా అడుగులు వేయగలమా?. కేంద్రం ఈబీసీలకు రిజర్వేషన్లు ప్రకటించిన వారంలోపే మార్గదర్శకాలు ఇచ్చేసింది, కానీ చంద్రబాబు మాత్రం 2019, ఏప్రిల్ 11న ఎన్నికలు జరిగితే.. మే 6న మార్గదర్శకాల కోసం కమిటీ వేశారు. ఈబీసీలకు కేంద్రం ఇచ్చిన కోటాలో అయిదు శాతం రిజర్వేషన్లు ఇస్తాననడం ద్వారా, ఇంతకు ముందు బీసీల్లో చేర్చే అవకాశం ఉందన్న కాపులకు కల్పించిన ఆశలమీద కూడా చంద్రబాబే నీళ్లు జల్లారు. కాపుల రిజర్వేషన్ల విషయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఖరి ఎప్పుడూ మార్పులేదు. మొదటి నుంచి మేం చెబుతున్నట్లే బీసీల హక్కులకు భంగం కలగకుండా, వారి ప్రయోజనాలకు నష్టం రాకుండా జరిగే కాపు రిజర్వేషన్లకు మనం వ్యతిరేకం కాదు. కాపు రిజర్వేషన్లకు ఎప్పుడూ మద్దతు ఉంటుంది, మేనిఫెస్టోలో చెప్పినదానికి కట్టుబడి ఉన్నాం. ఈ బడ్జెట్‌లో కాపులకు రూ.2వేల కోట్లు కేటాయించాం. కానీ చంద్రబాబు అయిదేళ్ల పాలనలో ఖర్చు చేసింది కేవలం రూ.1340 కోట్లే అని తెలిపారు.

# ద్రవ్యవినిమయ బిల్లుతో రాజన్న రాజ్యం ఖాయం

ఏడ్చారని గుర్తు చేశారు. ఆ తర్వాత ఇన్నాళ్లకు వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూసి మళ్లీ రాజన్న రాజ్యం వచ్చిందని, ప్రజల రాజ్యం వచ్చిందని ప్రతి ఒక్కరూ గుండెమీద చేయి వేసుకొని ధైర్యంగా చెప్తున్నారని కొనియాడారు. చరిత్రలోనే మొదటిసారి రైతులు, విద్యార్థులు, అవ్వతాతలు, ప్రైవేటు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆటో డ్రైవర్లు, బట్టలు కుట్టే ట్రైలర్లు, మత్స్యకారులు, నాయి బ్రాహ్మణాలు ఇలా అన్ని వర్గాలు ప్రజలు.. ఐదుకోట్లమంది ఇది మా బడ్జెట్ అని సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ఇందుకుగాను సీఎం వైఎస్ జగన్‌కు, ఆయన సూచనల మేరకు బడ్జెట్ రూపొందించిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

## రాష్ట్ర ఆస్తులు ధారాదత్తం చేస్తామంటే ఊరుకునేది లేదు

మచిలీపట్నం డీప్ వాటర్‌పోర్టు, పోర్టు ఆధారిత పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి తెదేపా ప్రభుత్వం నడుం కట్టిందని గుర్తుచేశారు. మచిలీపట్నం పట్టణాభివృద్ధి సంస్థను 2017 మార్చిలో ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది జూన్ 28న RT -62 జీవోను రహస్య జీవోగా జారీ చేసి, రెండు రోజుల్లోనే జారీ చేయలేదని మాట మార్చడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. బందరుపోర్టును తెలంగాణకు ఇస్తున్నారా అని అసెంబ్లీలో అడిగితే.. లేదని బుకాయించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీమాంధ్రకు పోర్టులు ప్రకృతి ఇచ్చిన వరమన్నారు. పోర్టుల పై సొంత నిర్ణయాలు తీసుకునే అధికారం ఎవరికీ లేదని హెచ్చరించారు. వైకాపా స్నేహాలకు, సొంత లాలూచీలకు రాష్ట్ర ఆస్తులను ధారాదత్తం చేస్తామంటే తెదేపా సహించదని చంద్రబాబు తేల్చిచెప్పారు. ఈ మేరకు తన అభిప్రాయాలను ట్విటర్‌లో పోస్ట్ చేశారు.

# మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ కన్నుమూత

అపోలో ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్సపొందుతూ సోమవారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి అంత్యక్రియలు ఓ వైపు జరుగుతుండగానే.. ముఖేశ్ గౌడ్ కన్నుమూయడంతో కాంగ్రెస్ పార్టీలో విషాదం నెలకొంది. రెండు రోజుల వ్యవధిలోనే కాంగ్రెస్ పార్టీ ఇద్దరు సీనియర్ నేతలను కోల్పోవడం ఆ పార్టీకి తీరని లోటుగా మారింది. 1959 జులై 1న జన్మించిన ముఖేశ్‌గౌడ్ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఉమ్మడి ఏపీలో రెండు సార్లు మంత్రిగా సేవలందించారు.

ముఖేశ్ మృతికి కేసీఆర్, చంద్రబాబు సంతాపం

మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ముఖేశ్ గౌడ్ మృతి పట్ల తెలంగాణ సీఎం కేసీఆర్, తెదేపా అధినేత చంద్రబాబు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా ఆయన చేసిన సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. ముఖేశ్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కేసీఆర్ ఆకాంక్షించారు. ముఖేశ్‌గౌడ్ మృతి విచారకరమని చంద్రబాబు అన్నారు. మూడు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో ఉన్న ముఖేశ్.. బీసీల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఏపీలో ఏడుగురు ఐపీఎస్ అధికారుల బదిలీ

గత మూడు నెలల్లో సంచలన కేసులను చేధించిన సిబ్బందికి అవార్డులు ప్రకటించామని, ఈ యేడాది రెండో త్రైమాసిక సంవత్సర అవార్డులను సోమవారం అందిస్తున్నామని డీజీపీ గౌతం సవాంగ్ పేర్కొన్నారు. సిబ్బందిని గుర్తించడంతో పాటు, మరింత ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ అవార్డులు అందజేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మొదటి అవార్డు విశాఖ టౌన్, రెండో అవార్డు విజయనగరం వన్ టౌన్ పీఎస్ కు రాగా, మూడో అవార్డు కడప జిల్లా రైల్వే కోడూరులకు అవార్డులు వచ్చాయి. కడప జిల్లా రైల్వే కోడూరులో షేక్ అబ్దుల్ ఖదీర్ అనే యువకుడి హత్య కేసు మిస్టరీ చేధనకుగాను మూడో స్థానం లభించగా, విజయనగరం వన్ టౌన్ పీఎస్ పరిధిలోలో నకిలీ లైసెన్స్, ఆర్సీ బుక్ లతో పేపర్ మెటీరియల్ ఉన్న లారీని చోరీ చేసి అమ్ముకున్న కేసును చేధించిన సిబ్బందికి రెండో అవార్డు వచ్చింది. విశాఖ సిటీ పీఎస్ పరిధిలో ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్, బండారు సత్యనారాయణలకు సీఎం పర్సనల్ సెక్రటరీ పేరుతో ఫేక్ కాల్ చేసి డబ్బులు దోచుకొని చిక్కకుండా ఉండేందుకు ఇంటర్నేషనల్ వాట్సప్ కాల్స్ చేసి మాట్లాడారు. మొబైల్ కాల్స్‌కు దొరకకుండా స్పూఫింగ్ చేసినా... టెక్నాలజీ, ఐపీ అడ్రస్ల ఆధారంగా ఈ కేసును చేధించినందుకుగాను విశాఖ టౌన్ పోలీసులకు మొదటి అవార్డును ప్రకటించారు.

ఇటువంటి కేసుల వివరాలపై మీడియాలో విస్తృత కవరేజి ఇవ్వాలని, కొత్త కొత్త మోసాలపై అప్రమత్తంగా ఉండేలా ప్రజలు కూడా అవగాహన పెంచుకోవాలని ఏపీ రాష్ట్ర డీజీపీ గౌతం సవాంగ్ తెలిపారు.

# రైల్వే ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపే రైల్వే ప్రైవేటీకరణ ఆపాలి




విశాఖపట్నం : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైల్వే స్టేషన్లు, స్థలాలు, ట్రాక్‌లు, రైళ్ళను ప్రైవేటీకరించి ప్రజలపై భారాలు మోపే 'రైల్వే ప్రయివేటీకరణను వెంటనే ఆపాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు డిమాండ్ చేసారు.

రైల్వే ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ సోమవారం సిఐటియు, ఎఐటియుసి, సిపిఐల ఆధ్వర్యంలో విశాఖ రైల్వే స్టేషన్ వద్ద ధర్నా జరిగింది. ధర్నా నుద్దేశించి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు, నగర కార్యదర్శులు ఎం.జగ్గునాయుడులు మాట్లాడుతూ దేశంలో ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తున్న సంస్థగాను, పేద, సామాన్య ప్రజలకు చౌకగా రవాణా సౌకర్యం కల్పిస్తున్న సంస్థగా మన భారతీయ రైల్వేలు ప్రపంచంలోనే 4వ అతిపెద్ద రైల్వే సంస్థగా పేరేన్నిక కల్గివున్నాయని, ఇంత పేరున్న రైల్వేలను ప్రైవేటీకరణ చేయడానికి బిజెపి ప్రభుత్వం పూనుకుందన్నారు.

ఎన్నికల ముందు బిజెపి ప్రభుత్వం రైల్వేజోన్ ఇచ్చినట్లే ఇచ్చి వాల్తేరు డివిజన్‌ను రద్దుచేస్తూ రాయఘడకు డివిజన్‌ను ఇచ్చి విశాఖ ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఈ చర్యలను కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున వ్యతిరేకించాలని డిమాండ్ చేసారు.

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మన రైల్వేలను ప్రయివేటీకరించడానికి నిర్ణయించిందన్నారు. సిపిఐ జిల్లా , నగర కార్యదర్శులు వెంకటరమణ, పైడిరాజులు మాట్లాడుతూ ప్రయాణికుల చార్జీల్లో వివిధ రకాలైన రాయితీలునిస్తూ, డివిడెంట్స్, పన్నుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు అందిస్తూ, సిబ్బంది వేతనాలు, రైల్వే నిర్వహణా ఖర్చులు పోనూ ప్రతీ సంవత్సరం లక్షల కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నవి మన రైల్వేలు. ఈ విధానాలను నిరశిస్తూ అన్ని కార్మికసంఘాలను, ప్రజాసంఘాలను, అభ్యుదయవాదులను, ప్రజలను కలుపుకొని రైల్వే పరిరక్షణకోసం పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, సిఐటియు నగర నాయకులు బి.జగన్, ఎం.సుబ్బారావు, ఆర్.పి.రాజు, వి.నరేంద్రకుమార్, ఒ.అప్పారావు, డి.అప్పలరాజు, సింహాచలం, ఐసి.నాయుడు, పి.పైడిరాజు, బి.వెంకటరావు, జి.పోలేశ్వరరావు, ఎం.సూరీడు తదితరులు పాల్గొంన్నారు.

# నేటి నుంచి రీ వేల్యుయేషన్‌కు స్పెషల్ డ్రైవ్

- శనివారం నాటికి ఫలితాలు సిద్ధం చేయాలి
- పరీక్షల విభాగంలో జవాబుదారీతనం పెంచాలి
- వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



ఆంధ్రవిశ్వవిద్యాలయంః ఏ.యూ.లో రీ వేల్యుయేషన్‌కు దరఖాస్తు చేసిన విద్యార్థుల ఫలితాలను అందించడానికి స్పెషల్ డ్రైవ్‌ను నేటి నుంచి నిర్వహించనున్నట్లు వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం ఆయన ఏయూ పరీక్షల విభాగం అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ అకడమిక్ డీన్ ఆచార్య కె.వెంకట రావు పర్యవేక్షణలో మూల్యాంకనం ప్రక్రియ చేయించడం జరుగుతుందని.ఇప్పటి వరకు దరఖాస్తు చేసిన విద్యార్థులకు జవాబు పత్రాలను మంగళవారం ఉదయానికి సిద్ధం చేయాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా జవాబు పత్రాల సంఖ్యను తెలియజేస్తే వాటికి సంబంధించిన నిపుణులను ఆహ్వానించి మూల్యాకనం చేయడం జరుగుతుందన్నారు. శనివారం నాటికి పూర్తిస్థాయిలో మూల్యాంకనం ప్రక్రియ ముగియాల్సిఉందన్నారు.

ప్రస్తుతం పరీక్షలు ముగిసిన 28 రోజుల్లోనే ఫలతాలను విడుదల చేయాలని సూచించారు. భవిష్యత్తులో పరీక్షలు ముగిసిన 14 రోజుల్లో ఫలితాలు అందించే దిశగా పనిచేయాల్సి ఉంటుందన్నారు.


ఆనందకరమైన వాతావరణంలో ఉదోగులు పనిచేయాలని సూచించారు. పరీక్షల విభాగంలో ఎటువంటి ఆలస్యం జరగరాదన్నారు. పరీక్షలు జరిగి ఇప్పటి వరకు ఫలితాలు వెల్లడించని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీటి ప్రగతిని తక్షణం కనుక్కోవాలని 72 గంటల్లో ఫలితాలను విడుదల చేయాలని సూచించారు.

పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు మార్కులు తెలియజేయాలని పరీక్షల విభాగం అధికారులు కోరగా, దీనిపై వీసీ సానుకూలంగా స్పందించారు. విద్యార్థుల మార్కులు తప్పనిసరిగా చెప్పాలని, దీనికి సంబంధించిన అనుమతులు తాము మంజూరు చేస్తామన్నారు. తద్వారా పరీక్ష తప్పిన విద్యార్థులు రీ వేల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవడంపై స్పష్టత వస్తుందన్నారు. ఈ విధానం వలన రీ వేల్యుయేషన్‌కు వచ్చే దరఖాస్తుల సంఖ్య సైతం తగ్గుతుందన్నారు.

సమావేశంలో అకడమిక్ డీన్ ఆచార్య కె.వెంకట రావు, డీన్‌లు ఆచార్య శివప్రసాద్, జగన్నాధ రావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.వి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్పందనకు 937 దరఖాస్తులు

**- స్పందన అర్జీలను తక్షణం పరిష్కరించాలి - సంయుక్త కలెక్టర్ ఎల్.శివశంకర్**




విశాఖపట్నం : జిల్లా అధికారులు ప్రతిరోజు స్పందన అర్జీ లపై అరగంట సమీక్ష జరపాలని సంయుక్త కలెక్టర్ ఎల్. శివశంకర్ అధికారులను ఆదేశించారు. నియమిత కాలపరిమితిని అనుసరించి వాటిని తప్పక పరిష్కరించాలన్నారు. తమ పరిధిలో లేని, వేరొక శాఖకు చెందిన వాటిని వెంటనే గుర్తించి సంబంధిత శాఖకు పంపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అటువంటి వాటివిషయంలో కాలయాపన తగదన్నారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి దరఖాస్తులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఇల్లు, రేషన్ కార్డులు, పింఛన్లు మొదలైనవాటిని కోరుతూ దరఖాస్తులు వచ్చాయి. భూ సంబంధమైన, స్థల సంబంధమైన వాటికి సంబంధించి కూడా కొందరు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈరోజు స్పందనకు 937 దరఖాస్తులు వచ్చాయి. వాటిని విచారించి సంబంధిత అధికారులకు అందజేశారు. స్పందన దరఖాస్తులకు అందజేశారు. దరఖాస్తుల రిజిస్ట్రేషన్ కు 16 కౌంటర్లను ఏర్పాటు చేశారు. సంయుక్త కలెక్టర్ తో బాటు జెసి 2 ఎం. వెంకటేశ్వరరావు, జిల్లా రెవిన్యూ అధికారి ఎం. శ్రీదేవి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ కలెక్టర్‌కు 12 కాల్స్

విశాఖపట్నంః సోమవారం డయల్ యువర్ కలెక్టర్ కు 12 ఫోన్ కాల్స్ వచ్చాయి.

జిల్లా రెవిన్యూ అధికారి ఎం. శ్రీదేవి ఈ కార్యక్రమం లో పాల్గొని ప్రజల ఫోన్ కాల్స్ కు సమాధానాలు ఇచ్చారు. రోలుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తున్న నాగేశ్వరరావు తమకు గీతాలు రావటం లేదని ఫిర్యాదు చేశారు నాతవరం మండలం చమ్మచింత గ్రామం నుండి ఫోన్ చేసిన నాయుడుబాబు తనకు వన్-బి రావడంలేదని చెప్పగా, భూమి గొడవలో ఉన్నందున పెండింగ్లో పెట్టి ఉంటారని చెప్పారు. దీనిపై తగిన ఆదేశాలు ఇస్తామన్నారు. వి.మాడుగుల కు చెందిన బి సూర్యనారాయణ ఫోన్ చేసి తనకు ప్రమాదంలో కాలు విరిగింది అప్పటినుండి 19 సంవత్సరాలుగా మంచం పైనే ఉంటున్నానని చెబుతూ తనకు వికలాంగ పింఛను వస్తున్నప్పటికీ తనకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ 10000 ఇప్పించవలసిందిగా కోరారు. అనకాపల్లి మండలం కొత్తూరు గ్రామం నుండి ముత్యం సత్యనారాయణమూర్తి తమ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేదని గతంలో ఫిర్యాదు చేయగా అధికారులు వచ్చి ఎస్టిమేషన్ వేశారని కానీ పని ప్రారంభించలేదని ఫిర్యాదు చేశారు.

గాజువాక మండలం నుంచి శిరీష్ తనకు ఓటరు గుర్తింపు కార్డు ఎంతవరకు రాలేదని వెంటనే ఇప్పించవలసింది గా అభ్యర్థించారు. అర్జీలను సంబంధిత శాఖల జిల్లా అధికారుల ద్వారా తక్షణ చర్యలు చేపడతామని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు

# సంపూర్ణ అక్షరాస్యతకు ప్రభుత్వ కృషి

- అమ్మఒడి పథకం ద్వారా విద్యాభివృద్ధి
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు




భీమునిపట్నంః స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 17.60 లక్షలతో నిర్మించిన అదనపు భవనాలను స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ విద్యను చేరువులోకి తీసుకురావడం ద్వారా రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత ను సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన అన్నారు రాష్ట్రంలో అమ్మబడి పథకం ద్వారా బడిఈడు పిల్లలను బడి బాట పట్టించి విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు మైనార్టీలకు ఎస్సీలకు ఎస్టీలకు అత్యధిక ప్రధాన మంత్రి ఎందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని అన్నారు కుటుంబాలు చూపెడు తున్న మద్యాన్ని రూపుమాపేందుకు దశలవారీగా మద్య నిషేధం అమలు చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ విశ్వనాథ సన్యాసిరావు డిప్యూటీ డీఈఓ ప్రేమ్ కుమార్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి వెంకట్రావు భీమిలి జోన్ కమిషనర్ సిహెచ్ గోవిందరావు వైసీపీ నాయకులు పాల్గొన్నారు

# గీతంలో మూట్‌కోర్టు పోటీ విజేత డిఎస్ఎన్ఎల్‌యు



సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలలో జూలై 26వ తేదీ నుంచి 29 వరకు జరిగిన ప్రాంతీయ మూట్ కోర్టు పోటీలలో దామోధరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ (డిఎస్ఎన్ఎల్‌యు) విద్యార్థులు అత్యత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచి ట్రోఫీలను అందుకున్నారు.సిద్ధార్థ న్యాయ కళాశాల విద్యార్థులు ద్వితయ స్థానంలో నిలిచారు. గీతం స్కూల్ ఆఫ్ లా విద్యార్థిని ట్వింకిల్ షాజీ ఉత్తమ పరిశోధకదాలుగా అవార్డు అందుకున్నారు. గీతం మూట్ మరియు అడ్వకసీ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలనుంచి దాదాపు 15 న్యాయకళాశాలల జట్లు పాల్గొన్నాయని గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ ఆర్.అనితారావు తెలిపారు. న్యాయ వృత్తిలో పాటించాల్సిన మెలకవులపై విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడంతో పాటు, వాదోపవాదాలపై న్యాయస్థానంలో వృత్తి నైపుణ్యాన్ని పెంచటానికి ఈ మూట్ కోర్టు పోటీలను నిర్వహించామని డైరక్టర్ తెలిపారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం అంబేద్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.సుమిత్ర, నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ.రాజేంద్రప్రసాద్ ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలలో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులకు సర్టిఫికేట్‌లు అందజేశారు.

# ప్రపంచ జల సంరక్షణ దినోత్సవం




విశాఖపట్నంః ప్రపంచ జల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమతా డిగ్రీ పి.జి కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. యూనిట్స్ ఆధ్వర్యంలో నేచర్ కన్సర్వేషన్ డే ను సోమవారం నిర్వహించారు. ఇదులో భాగంగా కలశాల ప్రిన్సిపాల్ విజయరవీంద్ర మాట్లాడుతూ నీటి వనరులు సంరక్షించుకోవాల్సిన భాద్యత ప్రతి వ్యక్తీ పై ఉందన్నారు . తరగిపోతున్న భూగర్భ జలాలను పెంచడానికి వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా జాగ్రత్తలు తిసుకోవాలన్నారు .కళాశాల డైరెక్టర్ డా.జి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ జల సంరంక్షణకు ముఖ్యంగా ఇంకుడు గుంతలు తవ్వడం ,నీటిని పొదుపుగా వాడడం ,ప్రతి నీటి బొట్టునూ వడిసిపెట్టి భవిష్యత్ తరాలకు అందించాలని వివరించారు అనంతరం నీరే కదా అని వృధా చేస్తే మిగిలేది కన్నీరే మరియు గ్రామాల్లో చెరువులు పల్లెలకు సిరులు అనే నినాదాలతో భారీ ర్యాలీని నిర్వహించారు .ఇందులో సుమారు 200 మంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్స్ మరియు ఎన్.ఎస్.ఎస్. ఆఫీసర్లు వెంకటేశ్వ రావు, డా . బి. రాజేష్ .కళాశాల అధ్యాపక ,అధ్యపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

- ఆర్యోగ కేంద్రాన్ని సందర్శించిన రెక్టార్, రిజిస్ట్రార్
- చికిత్స పొందుతున్న విద్యార్థి ఆరోగ్యంపై ఆరా
- వైద్యకేంద్రం సేవలపై అధికారులు సంతృప్తి



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఏయూ వైద్య కేంద్రాన్ని ఏయూ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాద రావు, రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్‌లు సోమవారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య కేంద్రాన్ని పరిశీలించి, చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న విద్యార్థి నీలాంబర్‌తో మాట్లాడారు. విద్యార్థి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిరక్షించే దిశగా ఆరోగ్య కేంద్రం తన సేవలు అందించాలని అధికారులు సూచించారు.

ఏయూ వైద్య కేంద్రం సిబ్బంది అందిస్తున్న చికిత్స విధానం గమనించారు. అనంతరం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కె.ఎస్.ఎన్ మూర్తితో మాట్లాడుతూ. వైద్య కేంద్రం అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన అధికారులకు వివరించారు. నిత్యం వందలాది మంది విద్యార్థులకు కేంద్రం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందన్నారు. వైద్య కేంద్రం రెండో అంతస్థు నిర్మాణం జరిగితే పూర్తిస్థాయిల 24 గంటలు వైద్య సేవలు విద్యార్థులకు అందించడం సాధ్యపడుతుందని తెలిపారు.

వైద్య కేంద్రంలో ఏర్పాటు అందుబాటులో ఉంచిన ఉపకరణాలను అధికారులకు చూపించారు.

# బదిర విద్యార్థులకు గీతం అస్పత్రి వైద్యశిభిరం

సాగర్‌నగర్ : స్థానిక పెదజాలరిపేట సమీపంలో శాంతి ఆశ్రమంలో గల బదిరులైన పాఠశాల విద్యార్థులకు గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి, సామాజిక వైద్య విభాగం ఆధ్వర్యంలో సోమవారం తేది:29-07-2019న ప్రత్యేక వైద్య శిభిరాన్ని నిర్వహించారు. శాంతి ఆశ్రమంలోని మొత్తం 120 మంది విద్యార్థులకు చెవి, ముక్కు, గొంతు పరీక్షలతో పాటు బాలికలకు గైనికాలజీ పరీక్షలను నిర్వహించినట్లు కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.చంద్రిక తెలిపారు.

కార్యక్రమంలో జిమ్‌సర్ సూపరెంటెండెంట్ డాక్టర్ శ్యామ ప్రసాద్, జిమ్‌సర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్రకాష్ బాబు, వైద్య నిపుణులు, డాక్టర్ సంజీవ్‌కుమార్, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ లక్ష్మీరాజ్యం, డాక్టర్ హరిణీ, డాక్టర్ గ్రీష్మ పాల్గొన్నారు.

చదవండి.. చదివించండి..
**విజయభాను**

**శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామివారి దేవస్థానం.. సింహాచలం..**
**విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్ -ఫోన్ నెం. 0891-2764949**
ఇ-మెయిల్: endow-eosvlnsd@gov.in, jc eo_simhachalam@yahoo.co.in
**ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండరు ప్రకటన**
**ఆర్.సి.నెం ఇ1/2790/2019 తేది. 29.07.2019**

1. కొండపై మొదటి మలుపు సెక్యూరిటి పాయింట్ వద్ద సి.సి. వాల్ నిర్మాణం చేయుటకు పై పనులకు www.apeprocurement.gov.in ద్వారా టెండర్లు పిలువడమైనది.
వెబ్‌సైట్: www.simhachalamdevasthanam.net

సం/- కె. రామచంద్రమోహన్
కార్యనిర్వహణాధికారి

**రక్షణ మంత్రిత్వ శాఖ**
**నావల్ డాక్‌యార్డు, విశాఖపట్నం**
**(టెలిఫోన్: 0891 2816350, 6366 ఫ్యాక్స్: 0891 2816688)**
**ఇ-టెండరు ప్రకటన**

కోటింగ్ నెం. **ఆర్‌పివైపి/ఓటిఆర్/18-19/263**

1. ఎన్‌డి(వి) వద్ద వెకార్స్ విభాగము కొరకు ఎస్ఆర్‌జిఎమ్ చెస్టు ఫెసలిటీ యొక్క విద్యుత్ సరఫరా యూనిట్ల మరమ్మతులు పునరుద్దరణ మరియు నిర్వహణ కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా డిజిటల్‌గా సీలు చేసిన టెండర్లు కోరుచున్నారు.
2. ఇ-టెండరు డాక్యుమెంట్లు వెబ్‌సైటు: www.defproc.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోగలరు. ధరావత్తు జమ క్రింద **రూ. 27,500/-**లకై ఏదేని జాతీయ బ్యాంకు నుంచి తీసిన డిమాండ్ డ్రాఫ్టును ఆఫ్‌లైను డాక్యుమెంటుతో జతచేసి పంపవలెను.
3. ఆఫ్‌లైను సీలు చేసిన టెండర్లు **"ఎమ్‌వైపి"** అన్ని మార్కు చేసి నేవల్ డాకుయార్డు విశాఖపట్నం యొక్క విజయ్‌నగర్ గేటు వద్ద గల బాక్సులో వేయుటగాని లేదా ఈ కార్యాలయానికి 03 ఆగస్టు 19 (1830 గం.లు) లోపు చేరేలా రిజిష్టరు పోస్టు ద్వారా పంపగలరు.

**davp 10702/11/0106/1920** **డిజిఎమ్ (ఆర్‌పి)**

# విజయభాను

## సంపాదకీయం

### ఫలించిన కాషాయ కసరత్తు

బీజేపీ నాయకుడు యెడియూరప్ప శుక్రవారం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో, కర్ణాటకలో అధికారంలోకి రావడానికి బీజేపీ చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు నెరవేరాయి. బీజేపీ గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మెజారిటీ లేకున్నా సరే, అధికారం చేపట్టి ఆ తరువాత వీలును బట్టి ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి మద్దతు కూడగట్టడానికి ప్రయత్నించింది. కానీ ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, జేడీఎస్ బలంగా ఉండటంతోపాటు, సుప్రీంకోర్టు జోక్యంతో నాటి ప్రయత్నం బెడిసికొట్టింది. మోదీ-అమిత్ షా దుందుడుకు విధానాలు తెలిసిన వారికి ఇంతకాలం కర్ణాటకలో సంకీర్ణ ప్రభుత్వం నిలదొక్కుకోవడమే ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ విజ యం సాధించడమే కాదు, కర్ణాటకలోని 28 సీట్లలో రెండు తప్ప అన్నీ కైవసం చేసుకున్న తరువా త, ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని కూలదోయకుండా సంయమనం పాటిస్తుందని ఊహించలేం. మెజారిటీ లేనప్పుడు సంకీర్ణాలు ఏర్పడటం, అవి విభేదాలతో కూలిపోవడం, ప్రతిపక్షం అధికారంలోకి రావ డం మొదలైనవి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో సాధారణమే. కానీ బీజేపీ పెద్దలు- కొందరు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, వారి అభిమతమేమిటో స్పీకర్ కూడా తెలుసుకోలేని స్థితిలో, అసెంబ్లీలో బలపరీక్ష సందర్భంలో వారిని మరో రాష్ట్రానికి తరలించి దాచిపెట్టి, రాష్ట్ర ప్రభుత్వాన్ని అత్యంత మొరటుగా కూలదోసిన తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నది. దాదాపు ఇరవై రోజుల అనిశ్చితి తరువాత బీజేపీ ప్రభుత్వం అతి కష్టమ్మీద ఏర్పడింది. కానీ ఈ క్రమంలో రాజకీయాలను అత్యంత అథమ స్థాయికి దిగజార్చింది. ప్రజాస్వామ్యవ్యవస్థలో గోప్యతకు తావులేదు. కర్ణాటక పరిణామాలు దేశంలోని ప్రాంతీయశక్తులకు కూడా ప్రమాదకర హెచ్చరిక. అనేక జాతులు, సంస్కృతులున్న విశాలమైన దేశంలో ప్రాంతీయశక్తులు వికసించడానికి భరోసా ఉండాలె. ప్రధాన స్రవంతి రాజకీయాలకు భిన్నంగా ఉండే భావజాలాలకు ఆమోదం ఉండాలె. బలహీనవర్గాలు అధికారం చేపట్టడానికి దారులు తెరిచిపెట్టాలె. దీనివల్ల ప్రజాస్వామ్యానికి మరింత విశ్వసనీయత ఏర్పడుతుంది. కానీ జాతీయ రాజకీయశక్తులు ఎదుగుతున్న పక్షాలను మొగ్గలోనే తుంచివేస్తూపోతే, పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిధిలో పరివర్తన సాగదు. అంతర్జాతీయ ఒడంబడికలు మొదలుకొని, దేశ రాజకీయాల వరకు అన్నీ ప్రజలకు తెలిసే విధంగా బాహాటంగా జరుగవలసిందే. కానీ ఎమ్మెల్యేలను దాచిపెట్టడమే అత్యంత దారుణమైన విధానం యథాలాపంగా సాగుతున్నది. ఎమ్మెల్యేలు ధైర్యంగా ప్రజల మధ్య ఉండాలె. ఇటువంటి సంక్షోభ సమయంలో రాష్ట్రంలో ఉంటూ అవసరమైతే స్పీకర్‌ను కలుసుకోవాలె. తమ వైఖరిని ప్రజలకు వివరించాలె. దేశంలో సైనిక పాలన లేదు, చట్టబద్ధపాలన సాగుతున్న ది. రాష్ట్రంలో ఉండటం వల్ల వారికి ప్రమాదం ఏర్పడినా, ఒత్తిడులు వచ్చినా చట్ట ప్రకారం భద్ర త పొందవచ్చు. దీనికోసం అవసరమైతే సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చు. కానీ మరో రాష్ట్రానికి తరలిపోయి, రహస్య జీవనం సాగించడం ప్రజా ప్రతినిధులకు తగనిపని. ఇప్పుడు కర్ణాటక అసెం బ్లీ స్పీకర్ పరాయి రాష్ట్రంలోని శిబిరాలలో ఉన్న ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదిస్తారా లేక అనర్హులుగా ప్రకటిస్తారా అనేది చర్చానీయాం శం. స్పీకర్ నిర్ణయం నచ్చనివారు సుప్రీం కోర్టు ను కూడా ఆశ్చయించవచ్చు. కానీ రాజకీయ పక్షాల నాయకత్వాలు, ప్రజాప్రతినిధులే విలువలను పట్టించుకోనప్పుడు ఎన్ని రాజ్యాంగ నిబంధనలను రూపొందించినా ఫలితం ఉండదు. ప్రజాప్రతినిధులను వారి ఇష్టానికి విరుద్ధంగా పార్టీ విధేయతకు కట్టిపడేయడం కూడా ఆచరణలో సాధ్యం కాదు. ఇందుకు ఫిరాయింపు నిరోధక చట్టం వచ్చిన నాటి నుంచి చెప్పుకోవడానికి అనేక ఉదంతాలు ఉన్నాయి. ప్రజాప్రతినిధి తమ ప్రజలకు జవాబుదారీగా, పార్లమెంటులో స్వేచ్ఛగా వ్యవహరించే విధంగా ఉండాలె. ఫిరాయింపుల సంస్కృతిని అరికట్టాలంటే రాజకీయ విలువలను పరిరక్షించడం ద్వారానే సాధ్యం. కానీ ప్రజా ప్రతినిధుల స్వేచ్ఛను కట్టడి చేయడం ద్వారా కాదు. ఇటువంటి కీలక అంశాలను రాజకీయ పక్షాల నాయకులు చర్చించి పరిష్కరించాలె. కానీ రాజకీయపక్షాల నాయకత్వాలే ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ విలువల పతనానికి దోహదపడుతున్నాయి. కర్ణాటక పరిణామాలు దేశంలోని ప్రాంతీయశక్తులకు కూడా ప్రమాదకర హెచ్చరిక. అనేక జాతులు, సంస్కృతులున్న విశాలమైన దేశంలో ప్రాంతీయశక్తులు వికసించడానికి భరోసా ఉండా లె. ప్రధాన స్రవంతి రాజకీయాలకు భిన్నంగా ఉండే భావజాలాలకు ఆమోదం ఉండాలె. బలహీనవర్గాలు అధికారం చేపట్టడానికి దారులు తెరిచిపెట్టాలె. దీనివల్ల ప్రజాస్వామ్యానికి మరింత విశ్వసనీయత ఏర్పడుతుంది. దీంతో పార్లమెంటేతర మార్గాలను తొక్కవలసి వస్తుంది. కనీసం సమాఖ్య విధానాల పరిరక్షణకైనా భరోసా లభించడం లేదు.

## చోడవరం మున్సిపాలిటీ ప్రతి పాదన ఎమ్మెల్యే ధర్మశ్రీ విరమించుకోవాలి

### చోడవరం మాజీ శాసన సభ్యులు కె.ఎస్.ఎన్.ఎస్.రాజు



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ శాసన సభ్యులు కె.ఎస్.ఎన్.ఎస్.రాజు.

చోడవరం : గ్రామీణ ప్రాంత ప్రజలకు ఏ రకంగాను ఉప యోగపడని చోడవరం మున్సి పాలిటీ ప్రతిపాదనను ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ వెంటనే విరమిం చుకోవాలని చోడవరం మాజీ శాసన సభ్యులు కె.ఎస్.ఎన్. ఎస్.రాజు అన్నారు. స్థానిక విలేఖరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ చోడ వరంను మున్సిపాలిటీ చేయా లని ఎమ్మెల్యే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని, ప్రజలు వ్యతిరేకిస్తున్నా, హడావిడిగా నివేధికలు సిద్ధం చేస్తున్నా రన్నారు. మున్సిపాలిటీ చేయడం వలన చోడవరం పంచాయతీ పరిధిలోని రేవళ్ళు, పి.ఎస్.పే ట, నర్సయ్యపేట,గాంధీగ్రామం, అంకుపాలెం, శ్రీరామ పట్నం, మైచర్లపాలెం, ఖండిపల్లి, దామునాపల్లి, లక్ష్మీపురం పంచాయతీల ప్రజలు నష్టపోవలసి వస్తుందన్నారు. ముఖ్యంగా ఆయా గ్రామాలు మున్సిపాలిటీ చేయడం వలన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం అమలుకాదని, దీని వలన వేలాధి మంది కూలీలు ఉపాధి కోల్పోతారన్నారు. అలాగే ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా జరిగే సి.సి.రోడ్లు, అంగన్వాడీ, ఇతర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు నిలచిపోయే అవకాశముందన్నారు. నూతన గృహాలు నిర్మాణ సమయంలో నిబంధనలు అడ్డుగా ఉంటాయని, 6 నెలకు ఒక సారి హౌస్ టాక్సులు, కుళాయి బిల్లులు ఇలా పన్నులు కట్టాల్సి వస్తుందన్నారు. తలసరి ఆదాయంలో మార్పు రాకుండా మున్సిపాలిటీని చేయడం వలన ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుం దన్నారు. దీనిపై ఎమ్మెల్యే పునరాలోచించాలని, గ్రామా లలో సమావేశం నిర్వహించి మున్సిపాలిటీ వలన కలిగే లాభ,నష్టాలు వివరించి ప్రజాభిప్రాయసేకరణ చేయాలని కోరారు. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా మున్సిపాలిటీ చేయాలని చూస్తే ప్రభుత్వంకు సమస్య వివరిస్తామని, అదీ కుదరకపోతే ప్రజల తరపున ఉద్యమించి, న్యాయ స్థానంలో పోరాడతామన్నారు.

అలాగే రహదారి విస్తరణకు తాము వ్యతిరేకం కాదని, ప్రధాన రహదారి పక్కన వందలాధి మంది చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారని వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో షుగర్ ఫ్యాక్టరీ మాజీ ఛైర్మన్ గూనూరు మళ్లునాయుడు, మాజీ ఎం.పీ.పీ.గూనూరు పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

## ధ్యానోత్సవం




విశాఖపట్నం : ఆగస్టు 1వ తేదీ నుంచి మూడు రోజుల పాటు బుల్లయ్య కాలేజ్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 3నుంచి 5 గంటల వరకు ధ్యానోత్సవాన్ని రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చనున్నట్లు నిర్వహకులు నాగ శర్మ అన్నారు. సోమవారం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ ఉరుకుల పరుగుల జీవితంలోలో ప్రజలు మానసిక ఒత్తిడికి లోన వుతున్నారన్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ధ్యానం అలవాటు చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ధ్యానం వల్ల ప్రశాంతత, ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పిల్లలు, పెద్దలు, విద్యార్థినీ విద్యార్థులు, పెద్దలందరూ పాల్గొనాలని కోరుకుంటున్నాం. ధ్యానం వల్ల మానసిక ప్రశాంతతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు తగ్గ తగ్గుముఖం పడతాయ న్నారు. పదిహేనేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనా లని పిలుపు నిచ్చారు. పూర్తి వివరాలకుకు 93935 52386, 98854 22020 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## చోడవరంలో మహిళా పోలీస్ వాలంటరీ నియామకాలు వాయిదా

చోడవరం : చోడవరం పోలీస్ సర్కిల్ వద్ద ఈ నెల 30న పేర్కొన్న మహిళా పోలీస్ వాలంటరీ నియామకాల ఇంటర్వ్యూలు తాత్కాళికంగా వాయిదా పడినట్లు చోడవరం మహిళా ఎస్.ఐ, టి.దివ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.విశాఖజిల్లాలో మహిళా పోలీస్ వాలంటరీ నియామకాన్ని చోడవరంలో జరగనున్నట్లు జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ ప్రకటన ఇవ్వడం జరిగిందని, అయితే ఇది కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కావడం, ఇతర సాంకేతిక కారణాల వలన ప్రస్తుతం వాలంటరీ నియమకాలు వాయిదా పడ్డాయని, త్వరలోనే తేదీ, సమయం నిర్ణయించి తెలియచేయడం జరుగుతుందని, అభ్యర్దినిలు గమనించాలని కోరారు.

## పెండింగ్ ఉపకారవేతనాలు, ఫీజురీయింబర్సుమెంట్ విడుదల చేయాలంటూ వినతి



తహసీల్దారుకు వినతి సమర్పిస్తున్న ఏ.ఐ.ఎస్.ఎఫ్ నాయకులు

చోడవరం : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నటువంటి ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్సుమెంట్, హాస్టల్ విద్యార్దుల మెస్ బిల్లులు వెంటనే చెల్లించాలంటూ చోడవరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్దులు ర్యాలీ నిర్వహించారు.

అఖిలభారత విద్యార్థి సమైక్య ఏఐఎస్.ఎఫ్, రాష్ట్ర సమితి పిలుపు మేరకుజిల్లా ఉపాధ్యక్షులు జి.ఓబులేషు ఆధ్వర్యంలో విద్యార్దులతో కలసి ర్యాలీ నిర్వహించి తహ సీల్దారు కార్యాలయం వద్ద సమస్యలపై నినా దాలు చేస్తూ నిరసన చేపట్టారు. అనంతరం తహ సీల్దారు రవి కుమార్‌కు వినతి పత్రం అంద చేశారు. ఈ కార్యక్రమంలో చోడవరం మండల కార్యదర్శి షణ్ముఖ, అధ్యక్షుడు ప్రసాద్, విద్యార్దులు తదితరులు పాల్గొన్నారు.

## 55 కేజీల గంజాయి పట్టివేత



నర్సీపట్నం : నర్సీపట్నం ఎక్సైజ్ పోలీసులు అక్రమంగా తర లిస్తున్న 55 కేజీల గంజాయిని సోమవారం పట్టుకున్నారు. ఎక్సైజ్ సిఐ సంతోష్ అందించిన వివరాల ప్రకారం ముందస్తు సమా చారం మేరకు నర్సీపట్నం మండలం గబ్బాడ జంక్షన్ వద్ద తనిఖీ చేయగా వైట్ మారుతి కారులో 55 కేజీల గంజాయి లభ్యమైం దన్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందని, ఒక వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.15వేల నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాదీనం చేసుకున్నామన్నారు.

## నర్సీపట్నం ఏఎస్పీగా రిషాంత్‌రెడ్డి



నర్సీపట్నం నూతనంగా ఏఎస్పీగా రానున్న రిషాంత్‌రెడ్డి

నర్సీపట్నం : నర్సీ పట్నం ఏఎస్పీ ఆరీఎ హాఫిజ్ బదిలీ అయ్యారు. గత రెండు సంవత్సరాలుగా ఇక్కడ ఏఎస్పీగా పని చేసిన హాఫిజ్ రంప చోడవరం ఒఎస్డీగా నియమితు లయ్యారు. కాగా నర్సీ పట్నం నూతనంగా ఏఎస్పీగా వై.రిషాంత్‌రెడ్డి రానున్నారు.

## ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

విశాఖ సిటీః రోటరీ క్లబ్ విశాఖ వేలీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని నిషేధిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో నిర్వహించిన ఈ ర్యాలీ ఆర్కే బీచ్ వద్ద నుంచి వైఎంసిఏ వరకూ కొనసాగింది. ర్యాలీని రొటేరియన్ పిడిజి డి. వరదారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. రోటరీ క్లబ్ విశాఖ వేలీ అధ్యక్షుడు బాబ్జీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పాస్ట్ ప్రెసిడెంట్ కె.వి. పద్మనాభన్, వి. హనుమంతరావు, రోటరీ క్లబ్ సభ్యులు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐసీసీ వరల్డ్ కప్ 2019లో అత్యధికంగా వీక్షించబడిన మ్యాచ్

ఇండియా వర్సెస్ న్యూజీలాండ్

ఐపీఎల్ మరియు ఐసీసీ వరల్డ్ కప్ లలో అత్యంత ప్రజాదరణ పొందిన క్రికెటర్ గా ఎంఎస్ ధోని

యూసీ బ్రౌజర్ క్రికెట్ సీజన్ ట్రెండ్స్ నివేదిక

విశాఖ సిటీ : ప్రపంచపు నెం. 1 థర్డ్ పార్టీ మొబైల్ బ్రౌజర్, కంటెంట్ ప్లాట్ ఫామ్ అయిన యూసీ బ్రౌజర్ లో ఇటీవలే ముగిసిన క్రికెట్ సీజన్ లో 4 బిలియన్ల మేరకు కంటెంట్ అంశాలను వీక్షకులు వీక్షించారు. అలీబాబా ఇన్నోవేషన్ ఇన్షియేటివ్స్ బిజినెస్ గ్రూప్ కు చెందిన యూసీ వెబ్ ఈ డేటాను విశ్లేషించింది. ఈ నివేదిక ప్రకారం క్రికెట్ సీజన్ కు సంబంధించి క్రికెట్, ఐపీఎల్, గేమ్, టి20, స్టేడియం, ఎంఎస్ ధోని, చెన్నై సూపర్ కింగ్స్, ఐసీసీ, ముంబై ఇండియన్స్, ఇండియన్ టీమ్ అనేవి టాప్ 10 హాట్ వర్డ్స్ గా ఉన్నాయి. 3.9 మిలియన్లకు పైగా ఇన్ ఫ్లుయెన్స్ ఇండెక్స్ తో బాగా ప్రజాదరణ పొందిన వ్యక్తిగా ధోనీ నిలిచారు. స్పోర్ట్స్ కంటెంట్ లో ఆడియోకు సంబంధించి బాగా ప్రజాదరణ పొందిన వేదికగా యూసీ బ్రౌజర్ నిలిచింది. బాల్ టు బాల్ కామెంటరీ 15 మిలియన్ల యూజర్ వినియోగాన్ని పొందింది. తమ ఉపకరణాలను అన్ లాక్ చేయకుండానే ప్రముఖులు అందించే బాల్ టు బాల్ ఆడియో లైవ్ కామెంట్రీని యూజర్లు వినేందుకు ఈ వేదిక అవకాశం కల్పిస్తుంది. ఇంగ్లీషు, హిందీలతో పాటుగా తెలుగు, తమిళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ, కన్నడం, మలయాళం, పంజాబీ భాషల్లో యూజర్లు క్రికెట్ కామెంటరీని పొందగలిగారు. రూ. 20 మిలియన్ల మేరకు బహుమతులను పొందేందుకు గాను ఈ క్రికెట్ సీజన్ లో 12 మిలియన్ల మందికి పైగా క్రికెట్ అభిమానులు ఇంటరాక్టివ్ ప్లే అండ్‌విన్ గేమ్ లో పాల్గొన్నారు. సీజన్ సందర్భంగా యూసీ క్రికెట్ ప్రతీమ్యాచ్ కు ముందు రిమైండర్ ఫీచర్ ద్వారా ప్రతీ యూజర్ కు కూడా నోటిఫికేషన్ ను పంపింది.

# కష్టాలను తీర్చే శ్రీ జగదాంబ మాత



## సంకీర్తన

మహారాష్ట్రలోని అత్యంత ప్రసిద్ధి గాంచిన ఒక పుణ్యస్థలాన్ని మీకు పరిచయం చేస్తున్నాం. మహా రాష్ట్రలో ఉన్న ముఖ్యమైన పట్టణాల్లో ఒకటైన అహ్మద్‌నగర్‌కు సమీపంలోని మొహాదే అనే ప్రాంతం ఉంది. ఇక్కడ శ్రీ జగదాంబ మాతా ఆలయం ఉంది.

ఈమాతను దర్శించు కునే భక్తులకు కోరిన కోర్కెలు, కష్టాలు తీరుతాయని బలమైన విశ్వాసం. ఈ ఆలయం ఇక్కడ వెలిసేం దుకు ఒక భక్తుడే ప్రధాన కారణం. అతని పేరే.. బన్సీ దహిఫలే. శక్తిపీఠాల్లో ఒకటైన మాహుర్ఘర్ అనే ప్రాంతంలో వెలసిన రేణుకా మాతకు తీవ్ర భక్తుడు. ప్రతిసారి అక్కడకు వెళ్లే భక్తుడు తమ గ్రామానికి వచ్చి వెలియాల్సిందిగా ప్రార్థించేవాడు. ఆయన కోర్కె ప్రకారం ఒక రోజు దహిఫలే కలలోకి వచ్చిన రేణుకా మాత.. ఆ గ్రామంలోని కొండ శిఖరంపై వెలసివున్నట్టు చెప్పింది. అప్పటి నుంచి భక్తుడు అక్కడకు వెళ్లి పూజలు చేసి, ప్రార్థినలు చేయసాగాడు. రేణుక మాత మరో రూపమే శ్రీ జగదాంబ మాత పేరుగాంచింది. గురు రిషేదర్, గురు మచేంద్ర నాథ్, కానిఫ్ నాథ్, కాహినాథ్, జాలింగర్ నాథ్ నాగనాథ్ అనే ప్రముఖులు ఈ ఆలయానికి వచ్చి మాతను దర్శించుకున్నారు. ఆశ్వని నక్షత్రం, ఏకాదశి రోజున శ్రీ జగదాంబ మాతకు ఉత్సవాలను నిర్వహిస్తారు.

ఆలయంలో లిఖించిన శిలాఫలకాలపై శ్రీజగదాంబ మాత తన శక్తిపీఠం వైపు చూస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ఆలయానికి సమీపంలో శివాలయం ఉంది.

దీనికి అనుకుని ఉన్న కోనేరులో పుణ్యస్నానం చేసిన తర్వాతే శ్రీ జగదాంబ మాతను దర్శనం చేసు కుమని భక్తులు చెపుతుంటారు.






## బాలల సమస్యలు పరిష్కారం కొరకు చర్యలు తీసుకోబడును

### అనంతగిరి మండల ఏపీఎమ్ సురేష్

అనంతగిరి : ఆగష్టు 1న విశాఖపట్నం జిల్లా పరిషత్ కార్యాలయంలో 0 సంవత్సరము నుండి 18 సంవత్సరాల లోపు పిల్లలకు (ఆడ మగ) ఉన్నా సమస్యలపై జాతీయ మరియు రాష్ట్రీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ వారు అర్జీలను రిజిస్ట్రేషన్ చేసుకొని వాటి సమష్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అనంతగిరి వెలుగు ఏపీమ్ సురేష్ ప్రకటన ద్వారా తెలిపారు.

## శ్రీవారిని దర్శించుకున్న జగదీష్



అనకాపల్లి : శాసన మండలి సభ్యులు విశాఖ రూరల్ జిల్లా తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీష్ తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఇటీవల పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్న జగదీష్ చిరకాల మిత్రులతో కలిసి స్వామివారి దర్శనానికి తరలివెళ్లారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం లభించింది. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందజేసారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వదించారు. ప్రజలకు సేవ చేసే భాగ్యం ప్రసాదించాలని, స్వామివారు కోరుకున్నట్లు ఈసందర్బంగా జగదీష్ తెలిపారు. ఆయనతో పాటు, కర్రి దివాకర్, కొణతాల వెంకటరావు, కాంఢ్రేగుల సత్యనారాయణ, కాంఢ్రేగుల కృష్ణఅప్పారావు, దూలం రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తూర్పు కాపులకు బిసి-డి దృవపత్రాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న గంగబాబు

మాకవరపాలెం : మాకవరపాలెం మండలంలో తూర్పు కాపులకు బిసి-డి దృవపత్రాలు మంజూరు చేయాలని బిజెపి యువ మోర్చ రాష్ట్ర కార్యదర్శి నగిశెట్టి గంగబాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా మాకవరపాలెం తహశీల్దార్ రాణీఅమ్మాజిని కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా గంగబాబు మాట్లాడుతూ బిసి-డి దృవపత్రాలు మంజూరు చేయక పోవడం వలన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. త్వరలో స్కాలర్‌షిప్‌కు నోటిఫికేషన్ రానుందని, తూర్పు కాపు విద్యార్థులు బిసి-డి సర్టిఫికేట్లతో స్కాలర్‌కు దరఖాస్తు చేయాల్సి ఉందన్నారు. కావున ఇప్పటికైనా మండలంలో ఉన్న మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి ఇచ్చి సర్టిఫికేట్లు మంజూరు చేయాలని ఆయన కోరారు.

## 30న రోలుగుంట సొసైటీ సమావేశం

రోలుగుంట : రోలుగుంట సొసైటీ పాలకవర్గం సమావేశం ఈ నెల 30వ తేదీన కార్యాలయంలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకటరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తాను అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత సొసైటీని లాభాల్లోకి తీసుకువెళ్లామన్నారు. సొసైటీ లావాదేవీలు రూ.11కోట్లకు పెంచామని వెంకటరావు వివరించారు.

**IN THE HONOURABLE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE AT VIZIANAGARAM**

**I.A. 403/2015 O.S. 207/2010**

**Between:**
**Kapil Chit fund Private Limited**
**Represented by its Asst.Manager ...Petitioner**
**And:**
**Chippada. Srinivasa Rao and others ...Respondents**
**Respondents :**
**1.Chippada. Srinivasa rao, S/o late Apparao, R/o D.no.46-1-69, Kummari Veedhi, Dondaparthy, Visakhapatanam.**
**3. kadiyaar, Srinivasa Babji, S/o late Viswanatham, R/o Q.no.622/7 Jail Area, Dondaparthy, Visakhapatanam**

Please take Notice That The above named Petitioner Filed the above Suit against your, and the matter coming for your appearance and stands posted to **07-08-2019,** on the day your personally or through advocate attend before the honourable court of the Prl. Junior civil Judge at Vizianagaram at about **10.30 AM** filing which the instructions court decided under the courtof Law.

Vizianagaram
Date: 29-07-2019

**Sri. D.RAMA RAO,**
**Advocate,**
**VIZIANAGARAM**

# ఆర్డీవో కార్యాలయంలో స్పందన

పెద్దాపురం : పెద్దాపురం డివిజన్లో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆర్డీవో ఎస్.మల్లిబాబు కోరారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 9 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు. వీటిలో పంచాయతీలో జరిగిన అవకతవకలపై రికవరీ చేయించమని ఒకటి,పట్టాదారు పాసు పుస్తకానికి సంబంధించి రెండు పాఠశాల ప్రాంగణంలో ఆకతాయిల వేధింపులపై చర్యలు తీసుకోవాలని ఒకటి, ఆక్రమణకు గురైన రోడ్డును తిరిగి వేయించమని ఒకటి, డ్రైనేజీ ఏర్పాటు చేయమని ఒకటి, శానిటేషన్ పనులు చేయించమని ఒకటి,భూమి పట్టాలు ఇప్పించమని ఒకటి,భూమిని తిరిగి సర్వే చేయించమని ఒకటి అర్జీలు వచ్చినట్లుఆర్డీవో తెలిపారు. డివిజన్లలోని ప్రతీ మండలం, మున్సిపాలిటీ, నగర పంచా యతీలలో స్పందన కార్యక్రమం మండలస్థాయి అధికారులు, మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహి స్తున్నారని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సమస్యలు ఉంటే అర్జీల ద్వారా ప్రథమంగా మండల తహశీల్దార్ కార్యాలయంలో అందజేయవలసి ఉంటుందని తెలిపారు. మండల స్థాయిలో పరిష్కరించలేని అర్జీలను ఆర్డీవో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.పరిష్కారం నిమిత్తం ఆయా శాఖలు ప్రభుత్వ నియమ నిబంధనలకనుగుణంగా పరిష్కరించబడతాయని, కొన్ని సమస్యలకు సమయం పట్ట వచ్చునని తెలిపారు. ఈ స్పందన కార్యక్రమంలో అర్జీల స్వీకరణ అనంతరం సమస్య పరిష్కరించే గడువు కాలం నిర్ణయించి రసీదు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

# సిరాజుద్దీన్‌కు ఘన నివాళి

### ప్రాణం వున్నంతవరకు ఆ కుటుంబానికి అండగా వుంటా : మంత్రి మల్లాడి




యానాం : సంఘ సేవకుడుగా అనేకమార్లు అనేక సేవలు అందించిన ముస్లిం సంఘ అధ్యక్షులు, కార్పొరేటివ్ మాజీ ఛైర్మన్ ఎం.వి.సిరాజుద్దీన్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి మంత్రి మల్లాడి కృష్ణారావు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సభ నుద్దేశించి మంత్రి మల్లాడి మాట్లాడుతూ సిరాజుద్దీన్‌తో వున్న అనుబంధం, రాజకీయాలలో ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ప్రజలకు సేవ చేసేందుకు నేను ఏదైతే చెప్పానో దానిని తూచా తప్పకుండా పనిచేశారన్నారు. 35 సం॥రాల మైనార్టీ నాయకుడిగా, లైన్స్ క్లబ్ అధ్యక్షులుగా కోపరేటివ్ ఛైర్మన్‌గా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పనిచేశారన్నారు. అనారోగ్యానికి గురైనప్పుడు పుదుచ్చేరి కోపరేటివ్ ఛైర్మన్ పదవి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని, ఆ పదవిని చేపట్టకుండా మృతి చెందడం బాధ కల్గించిందన్నారు. కోఆపరేటివ్‌లో అనేకమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించా రన్నారు. పలు శాఖలకు అన్ని సదుపాయాలు కల్పించారన్నారు. ఓల్డేజి హోంలో బ్లడ్‌బ్యాంక్ అధ్యక్షునిగా పనిచేసి మంచి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. సిరాజుద్దీన్ పేరుమీద ప్రతీ ఏటా ఓల్డేజ్ హోంలో ప్రముఖులు మాజీ లోక్ సభ స్పీకర్ జియంసి బాలయోగి, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ రాజేంద్రకుమార్ వాజ్‌పాయ్, కె.సి.చంద్రశేఖర్ స్మారక చేసున్న విధంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తామన్నారు. అలాగే సిరాజుద్దీన్ కుటుంబానికి ప్రాణం వున్నంతవరకు అన్ని విషయాలలోను అండగా వుంటామన్నారు. అక్టోబర్ 2 నాటికి ఓల్డేజ్ హోం ప్రారంభించి 26 సంవత్సరాలు పూర్తి అవుతుందన్నారు.

ఈ సంతాప సభలో ఎర్రా సుబ్బారావు, పెండెం సూర్యప్రకాష్, కొన కొండబాబు, సుబ్బారావు, ఆనందరావు, సత్యనారాయణ, ఈలప్రోలు విష్ణువర్ధనరావు, పెసల గంగయ్య, కాపగంటి ముకుందకుమార్, పుప్పల దేవప్రసాద్, చింతా వెంకటేశ్వర్లు, వంకాయన నరేంద్ర, దవులూరి సత్తిబాబు, వేలమంది నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో 'జాగృతి' కార్యక్రమం

## ప్రజల సహాయ, సహకారాలతో సారా విక్రయాల నియంత్రణ



పెద్దాపురం : క్షణిక ఆనందం కొరకు, తాత్కాలిక మత్తు కొరకు, కష్టపడి సాధించిన సొమ్ముతో తాగుడికి బానిసలై కుటుంబాలను అనాధలుగా చేస్తున్న ఈ సారా విక్రయాలను అరికట్టడానికి ప్రజల సహాయ సహకరాలు ఇచ్చి ప్రోత్సహించాలని పెద్దాపురం ఎక్సైజ్

### సిఐ యం.రామకృష్ణదాసు


సిఐ యం.రామకృష్ణదాసు అన్నారు. సోమవారం ఆయన విజయభాను విలేకరితో మాట్లాడుతూ తన పరిధిలో పలు గ్రామాలు, పట్టణాలు ఉన్నాయని, ముఖ్యంగా గ్రామ పరిధిలో సర్పంచ్‌లు, గ్రామ వాలంటీర్లు, ప్రజలు, సారా విక్రయాలు, నిల్వలు, తయారీలపై అధికారులకు సమాచారం అందించి, సారా విక్రయాలను అరికట్టడానికి సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, గ్రామాలలో విడతల వారీగా 'జాగృతి' కార్యక్రమం నిర్వహించబునని, ఆ కార్యక్రమంలో ప్రజలు సారా విక్రయాలపై తమ సమస్యలు తెలుకొనవలసినదిగా సిఐ యం.రామకృష్ణదాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్సై జె.విజయకుమార్, డీఇఇలు, డి.శివప్రసాద్, కె.జి.రామ్మోహనరావు, జి.సిహెచ్.సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పట్టా భూమి విక్రయంపై ఫిర్యాదు




అనకాపల్లి : తనకు చెందిన పట్టా భూమిని కొందరు వ్యక్తులు తనకు తెలియకుండా విక్రయించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని చేనుల అగ్రహారం గ్రామానికి చెందిన తలారి అప్పలనర్స అనే మహిళ సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ కు ఫిర్యాదు చేసింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం కొండుపాలెం గ్రామంలో సర్వే నెంబరు 107 లో గల సుమారు 38 సెంట్ల భూమి వారసత్వంగా లభించింది. అయితే ప్రస్తుతం ఆమె వేరే చోట నివసిస్తున్న తరుణంలో అదే అదునుగా కొందరు వ్యక్తులు తనకు తెలియకుండా రెవెన్యూ అధికారులు, దళారులు సహకారంతో ఆ భూమిని విక్రయించారని వాపోయింది. తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని, తన భూమి తనకు అప్పగించాలని కోరింది. లేని పక్షంలో కుటుంబ సభ్యులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించింది.

## చోడవరం పి.ఏ.సి.ఎస్ పాలకవర్గంకు ఘన సత్కారం



చోడవరం : చోడవరం పి.ఏ.సి.ఎస్. పాలక వర్గాన్ని స్థానిక మాజీ శాసన సభ్యులు కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ఘనంగా సత్కరించారు. పాలకవర్గం పదవీ కాలం ముగియండంతో కోపరేటివ్ సొసైటీ వద్ద సోమవారం వీడ్కోలు సభ నిర్వహించారు. పి.ఏ.సి.యస్. అధ్యక్ష, ఉపాధ్యక్షులు బొడ్డపాటి లక్ష్మణరావు, గూనూరు లక్ష్మీనారాయణ సంఘ కార్యదర్శి సింహాచలం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక మాజీ శాసన సభ్యులు కె.ఎస్.ఎన్. ఎస్.రాజు ముఖ్య అతిథిగా పాల్గొని పాలక వర్గాన్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ షుగర్ ఫ్యాక్టరీ ఛైర్మన్ గూనూరు మళ్లనాయుడు, చోడవరం సెంట్రల్ బ్యాంకు మేనేజరు ఎం.వి.వి. కిశోర్, మాజీ ఎం.పి.పీ.గూనూరు పెదబాబు, ప్రముఖ న్యాయవాది అల్లుగిరిధర్, నడుపూరి లక్ష్మీభాయ్, జగన్నాధం,నర్సయ్యపేట టీడీపి నాయకులు శ్రీను, పి.ఏ.సి.ఎస్ బోర్డు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## జైపాల్‌రెడ్డి మృతికి సంతాపం

యానాం : కేంద్ర మాజీ మంత్రి సీనియర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు జైపాల్‌రెడ్డి మృతికి పుదుచ్చేరి ఆరోగ్యశాఖమంత్రి మల్లాడి కృష్ణారావు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఢిల్లీ నుండి హైదరాబాద్ వస్తున్నప్పుడు మృతి చెందారన్న వార్త విని దిగ్భ్రాంతికి గురైనన్నారు. వెంటనే ప్రయాణం వాయిదా వేసుకొని ఆయన ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చి సంతాపాన్ని తెలిపారు. ఆయన కేంద్రమంత్రిగా వుండగా యానాం అభివృద్ధికి నిధులు మంజూరు చేశారన్నారు. దవలేశ్వరం నుండి యానాం వరకు భూగర్భ పైపులైను పనులకు 35 కోట్లు మంజూరు చేశారన్నారు.

కాంగ్రెస్‌పార్టీలో సీనియర్ నాయకుడుగా అనేక సేవలు అందించారన్నారు. ఆయన మృతి పార్టీకి, ప్రజలకు తీరిన లోటు అన్నారు. సంతాపం తెలిపిన వారిలో సుబ్బరాయుడు, పెసల గంగయ్య, పెండెం సూర్యప్రకాష్, మొలగజ్జెల ఆనందరావు, చింతా వెంకటేశ్వర్లు, దేవ ప్రసాద్, దేవస్థాన కమిటీ ఛైర్మన్ కాపగంటి ఉమాశంకర్, కర్రి స్వామి, దాసరి వీరబాబు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీవోను కలిసిన వైసీపీ నేతలు



అనకాపల్లి : నూతనంగా నియమితులైన అనకాపల్లి ఆర్డీవో జక్కుల సీతారామారావును స్ధానిక వైసీపీ నేతలు ఘనంగా సత్కరించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసారు.. అనంతరం సాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసారు.

ఈకార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, యువజన విభాగం నాయకులు జాజుల రమేష్, మాజీ కౌన్సిలర్ పలక రాము, పొలమరశెట్టి మురళీ, జగన్మోహన్, పార్టీ నాయకులు సూరిశెట్టి రమణ అప్పారావు, విల్లూరి శివసూరి, గైపూరి రాజు, కడిమిశెట్టి కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుకలారీ, ట్రాక్టరు సీజ్

చోడవరం : చోడవరం-అనకాపల్లి ప్రధాన రహదారి వెంకన్న పాలెంలో ఆదివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరు, గోవాడ ప్రధాన రహదారిలో సోమవారం తెల్లవారు జామున అక్రమంగా తరలిస్తున్న ఒక ఇసుక లారీని పట్టుకున్నట్లు ఎస్.ఐ, ఎస్.ఎ.మునాఫ్ తెలిపారు.ఇసుక తరలింపుకు సంబంధించి ఎటువంటి దృవీకరణ పత్రాలు లేకపోవడంతో వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### తహసీల్దారుకార్యాలయం, పోలీస్ గ్రౌండ్‌లోని ఇసుక విక్రయించాలని భవణ నిర్మాణ కార్మికుల వినతి



తహసీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న చోడవరం డివిజన్ భవన నిర్మాణ కార్మికులు

చోడవరం : పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం, పోలీస్ సర్కిల్ గ్రౌండ్‌లో వివిధ కేసులలో పట్టుబడ్డ ఇసుకను తగిన ధరను నిర్ణయించి విక్రయించాలని చోడవరం డివిజన్ భవణ నిర్మాణ కార్మికుల యూనియన్ శెక్రటరీ కొసరు తాతారావు స్థానిక తహసీల్దారు రవికుమార్, చోడవరం ఎస్.ఐ.డి లక్ష్మీనారాయణకు సోమవారం వినతి పత్రం అందచేశారు. ప్రస్తుతం మార్కెట్లో ఇసుక దొరకక భవణ నిర్మాణ పనులు ఆగిపోయాయని, దీని వలన భవణ నిర్మాణ కార్మికులు కూలిపనులు దొరక్క ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారన్నారు.

తహసీల్దారు, సర్కిల్ గ్రౌండ్‌లో డంపింగ్ చేసిన ఇసుకకు తగిన ధర నిర్ణయించి, దానిని వినియోగించుకునేలా చూడాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో దాడి శంకర్‌రావు, పులిబంటి మహేశ్వరరావు, జి.పరమేశ్వరరావు,సీరం సతీష్, ఎన్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## గజపతినగరంలో ఆగష్టు 1న ఉచిత వైద్య శిబిరం

చోడవరం : మండలంలోని గజపతినగరం గ్రామంలో ఆగష్టు 1 గురువారం కేర్ ఆసుపత్రి విశాఖపట్నం, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో, కాళ్ళ పవిత్రన్ వర్ధంతి సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కాళ్ల కృష్ణ, కాళ్ళ ఆదిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ ప్రాధమిక పాఠశాల ఆవరణలో జరిగే ఈ వైద్య శిబిరంలో గుండెకు సంబంధించిన సమస్యలు, జనరల్, బి.పి, షుగర్ పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే శంకర్ ఫౌండేషన్ వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, కంటి పరీక్షలు నిర్వహించి శుక్లము ఆపరేషన్‌కు ఎంపిక అయిన నిరుపేదలకు డాక్టరు సలహా మేరకు కాటరాక్ట్ చికిత్స , కంటిమీద కండ, మెల్లకన్ను సరిచేయుట, కంటి శుక్లాలు ఉన్న 14 సంవత్సరాలలోపు పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేయడం జరుగుతుందన్నారు.

ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ మెగా వైద్య శిభిరంను సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9177215725 మొబైల్ నెంబరును సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# అనాధ పిల్లలకు విశాఖ వేలీ విద్యార్థుల వితరణ



విశాఖపట్నం : తమ తోటి వయసువారిని ఆదుకోవాలనే దృక్పధంతో విశాఖ వేలి కి చెందిన 12వ తరగతి విద్యార్థులు కంచరపాలెం దరి అన్ని హన్నా అనాధ బాలల కేంద్రంలో విద్యార్థులకు క్రీడా వస్తువులు, చిరుతిండ్లు అందించారు. హోంలో వున్నా 5 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసున్న చిన్నారులకు ఆదుకునే క్రికెట్ బ్యాట్లు,బంతులు, క్యారంబోర్డులు, చెస్ బోర్డులు గేమ్స్ వంటివి అందించి వారితో సరదాగా గడిపి ఆనందం పొందారు.

ఈ కార్యక్రమంలో విశాఖ వేలి విద్యార్థులు అనురాగ్ చీరాల,గౌరీష్ శిల్పారశెట్టి, నిత్య, జన్మిత, ఐజాక్, అన్షు, మిథిలేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గురుద్వార్ పేరు పరిరక్షిస్తాం



విశాఖపట్నం : తామంతా గత కొన్నేళ్లగా గురుద్వార్ సధ్ సంగీత్ ను ఎర్పాటు చేసి వారి సంక్షేమం కోసం ఎంతో కృషి చెస్తే ఇప్పుడు పాలకవర్గం దానిని పక్కన పెట్టి నిదులను దుర్వినియోగం చేసి గురుద్వార్ పేరు ప్రతిష్టలను దిగజారుస్తున్నారని మాజీ సెక్రెటరీ సత్తిందర్ సింగ్ అందోళన వ్యక్తం చేశారు సోమవారం గురుద్వార్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ఎంతో పేరు ప్రతిష్టలు సంపాదించిన సంస్థను నేడు అధ్యక్షుని హోదాలో దిల్బా సింగ్ అనంద్ తన సొంత ఖాతాలో సుమారు నాలుగు కొట్ల మెర నిధులను మరల్చారని అవేదన వ్యక్తం చేశారు

దీని కోసం రెండు రొజులుగా అమరణ నిరాహారదీక్ష చెపట్టానని తెలిపారు ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సంస్థను కాపాడాలని అద్యక్షుడి హోదాలో ఉన్న పాలకవర్గాన్ని రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు

లేదంటే తామంత అందోళనలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సింగ్ నాయకులు ,హరవంత్ సింగ్,బల్వీందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు ,బి.ఎస్ మూన్,జితేంద్ర సింగ్, మన్ దీప్ సింగ్, హరపాల్ సింగ్,హరపాల్ సింగ్ హౌలక్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎస్‌బిఎం బార్‌మిల్లులో ప్రమాదం



గాజువాక: విశాఖ ఉక్కుకర్మాగారం ఎస్‌బిఎంబార్ మిల్లులో సోమవారం ప్రమాదం జరిగింది. ఐరన్ రాడ్స్‌ను క్రేన్లలతో తొలగిస్తుండగా ఐరన్‌రాడ్స్ పడి కాంట్రాక్టు కార్మికుడుకు తీవ్రగాయాలుపాలయ్యాడు. తోటికార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.....ఎస్‌బిఎం బార్‌మిల్లులో కాంట్రాక్టు కార్మికునిగా కాకినాడ ప్రాంతానికి చెందిన బి.రమణ విధులు నిర్వహిస్తున్నాడు. అయితే విధులలో భాగంగా క్రేన్ల సహాయంతో ఐరన్ రాడ్స్‌ను తొలగిస్తున్న సమయంలో రమణ ప్రమాదానికి గురైయ్యాడు. దీన్ని తోటి కార్మికులు గుర్తించి తక్షణమే ఆసుపత్రికి తరలించారు. భద్రతా కారణాలవలనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికులు ఆందోళన వ్యక్తం చేసారు. రాడ్‌లను తొలగిస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని వాపోయారు. పరిస్థితి విషమంగా ఉందని ఆవేదన వ్యక్తం చేసారు. మెరుగైన వైద్యంకోసం నగరంలోని ఒక ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.

బాధితునికి తగిన న్యాయం చేయాలని, అలాగే ఈ ప్రమాదానికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్లాంట్ వద్దధర్నా నిర్వహించి, న్యాయం చేయాలని డిమాండ్ చేసారు.

## డయల్ యువర్ కమిషనర్‌కు 23 ఫిర్యాదులు

విశాఖపట్నం : జి.వి.యం.సి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (నెంబరు 1800-4250-0009) కార్యక్రమానికి 23 ఫిర్యాదులు అందాయి. జివియంసి కమిషనర్ డా.జి.సృజన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి హాజరై పలువురి నుండి వచ్చిన ఫొన్ కాల్స్‌కు సమాధానం చెప్పారు. ఇందులో ఒకటవ జోన్‌కు సంబంధించి 2, రెండవ జోన్‌కు సంబంధించి 6 , మూడవ జోన్‌కు సంబంధించి రెండు, నాలుగవ జోన్‌కు సంబంధించి 4, ఐదవ జోన్‌కు సంబంధించి ఒకటి , ఆరవ జోన్‌కు సంబంధించి ఐదు, అనకాపల్లి జోన్‌కు సంబంధించి ఒకటి, భీమిలి జోన్‌కు సంబంధించి రెండు ఫిర్యాదులు అందాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి మూడురోజులులోగా నివేదిక సమర్పించాలని కోరారు.

## ఘనంగా అంతర్జాతీయ అమ్మ నాన్నల దినోత్సవ వేడుకలు



మర్రిపాలెం : జీవీఎంసీ 40 వ వార్డు పరిది లక్ష్మీ నగర్ వద్ద అంతర్జాతీయ అమ్మ నాన్నల దినోత్సవ వేడుకలు పురష్కరించుకొని వెంకటేశ్వర ప్రచార సమితి సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం స్థానిక వృథ దంపతులకు సన్మానించారు . ఈసందర్బంగా వెంకటేశ్వర ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశి నాయుడు మాట్లడుతూ మానవ జన్మలో అమ్మ నాన్నల పాత్ర గొప్పదని వృధాప్యంలో వారికీ అన్ని విధాలా సేవలు నదించాల్సిన బాద్యత మనందరిపై వుందన్నారు.కార్యక్రమంలో లక్ష్మీ నగర్ కమిటీ సభ్యులు అప్పల నాయుడు , గిరి , జ్యోతిష్, శంకర్ , గురునాధ్ పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గున్నారు .

# జోన్ 1 స్పందన లో సమస్యల వెల్లువ



మధురవాడ, మహా విశాఖ మధురవాడ జోన్ వన్ కార్యాలయం లో సోమవారం స్పందన సందర్భంగా కార్యాల యం కిటకిట లాడింది, మొత్తం ఇరవైతొమ్మిది వినతులు వచ్చి నట్లుగ గత శనివారం క్రొత్తగా బాధ్యతలు చేపట్టిన జోనల్ కమీషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు, అందిన వినతులను సంబంధిత అధికారులకు పంపించి తక్షణ పరిష్కారానికి చర్యలు, తీసుకుంటామన్నారు, అయిదవ వార్డులో ఈరోజు ఉదయం సందర్శించానని కొన్ని సమస్యలు కంటబడ్డాయని తెలిపారు, జోన్ కి సంబందించిన అన్ని విభాగాల అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి కొన్ని సూచనలు ఇచ్చారు, బిజెపి మైనారిటీ మోర్చా కార్యదర్శి తాతిపూడి ప్రదీప్ మారికవలస పాతకోలనీవద్ద త్రాగునీటి పైపులు మురుగునీటి కాలువ ప్రక్కన ఉండడంతో కలుషితం అవుతుందని జోనల్ కమీషనర్ కి చూపించి పిర్యాదు చేసారు, ఇదేక్రమంలో నాలుగో వార్డు వైసిపి అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు వార్డు సమస్యలపై వినతి పత్రాన్ని ఇచ్చారు, ఈఖార్యక్రమంలో ఇఇ ధిలీప్కుమార్, పట్టణ ప్రణాళిక అదనపు అధికారి హరిదాసు, టౌన్ సర్వేయర్ చంద్రశేఖర్, నీటి విభాగంఎఇ రత్నాకర్, ఎఎంహెచ్ఒ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట ..

## కంచరపాలెం ఎస్.ఐ నీలిమా ..



కంచరపాలెం : నేరాల నియంత్రణ విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం అని కంచరపాలెం పోలీస్ స్టేషన్ ఎస్ ఐ నీలిమా పేర్కొన్నారు .ఈ మేరకు సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన స్పందన కార్యక్రమములో భాగముగా ప్రజలు న్యాయం కోసం పోలీసుస్టేషన్‌ల చుట్టూ తిరగకూడదు. ఒక్కసారి అర్జీ ఇస్తే.. ఆ సమస్య పరిష్కారం అయిందో లేదో నేనే చూస్తా.. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా.. తెలిపారు. పోలీసుశాఖ ద్వారా తీసుకుంటున్న చర్యలను వెల్లడించారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. పోలీసుశాఖలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేస్తున్నాం. ప్రతి సోమవారం అన్ని పోలీసుస్టేషన్‌లలో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు(ఎస్‌హెచ్‌ఓ) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ అందుబాటులో ఉంటున్నారన్నారు .

జిల్లా వ్యాప్తంగా స్పందన కార్యక్రమంలో వస్తున్న అర్జీలలో ఎక్కువ శాతం భూ సమస్యలే ఉంటున్నాయి. తమ భూమి, స్థలాన్ని ఆక్రమించారని, పోనియకుండా దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారని, తమకు తెలియకుండా వేరే వ్యక్తులు రిజిస్ట్రేషన్(డబుల్ రిజిస్ట్రేషన్) చేసుకుంటున్నారని బాధితులు ఫిర్యాదుల్లో పేర్కొంటున్నారు. వీటిలో పోలీసుశాఖ నుంచి ఎంత వరకు న్యాయం చేయగలమో అంత వరకు చేస్తున్నాం. అయితే రెవెన్యూ సంబంధిత సమస్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఆస్కారం ఉండడంతో వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. భవిష్యత్‌లో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యలు పరిష్కారించాలని భావిస్తున్నాం.

. అలాగే స్పందన కార్యక్రమంలో అర్జీలు తీసుకున్న వెంటనే వారికి సీసీటీఎన్‌ఎస్ ద్వారా రిసిప్టులు అందజేస్తున్నాం. ఎప్పటిలోగా సమస్య పరిష్కారిస్తాం. తర్వాత ఎవర్ని సంప్రదించాలనే అంశం అందులో ఉంటుంది. ఫిర్యాదుదారుల సెల్‌ఫోన్ నెంబర్‌లు కూడా స్వీకరించి కంట్రోల్ రూం, డయల్ 100 సిబ్బంది ద్వారా సంబంధిత అర్జీదారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారం అయిందా.. లేదా అనే అంశంపై ఆరా తీస్తున్నాం. దీనివల్ల తప్పుడు లెక్కలకు ఆస్కారం ఉండదు.

స్పందన కార్యక్రమంలో బాధితుల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో అనేక ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తోంది. దీన్ని ఆసరగా చేసుకొని కొంతమంది మోసాలకు పాల్పడుతున్నారు. అందువల్ల నిరుద్యోగ అభ్యర్థులు ఇలాంటి విషయంలో నమ్మి మోసపోవద్దు. ఉద్యోగాలనేవి పూర్తిగా ప్రభుత్వ స్థాయిలో జరుగుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

## స్పందన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యతనివ్వండి

**- జివియంసి స్పందనకు 228 పిర్యాదులు - కమిషనర్ డా.జి.సృజన**



విశాఖపట్నం : స్పందనలో నమోదైన ఫిర్యాదుదారులను సందర్శించి ఎన్ని రోజులలో పరిష్కరిస్తారన్నది తెలియజేయాలని జివియంసి కమిషనర్ డా.జి.సృజన పేర్కొన్నారు. అదేవిధంగా ఫిర్యాదు పరిష్కారం అయిన తరువాత ఆ విషయాన్ని ఫిర్యాదు దారుకు తెలియజేయడంతోబాటు స్పందన రిజిష్టర్‌లో నమోదు చేయాలని వివరించారు.

జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మొత్తం 228 ఫిర్యాదులు అందాయి. జివియంసి కమిషనర్ డా.జి.సృజన ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు. అందిన మొత్తం 228 పిర్యాదులలో ప్రధాన కార్యాలయానికి సంబంధించి 88 ఫిర్యాదులు అందాయి. ఒకటవ జోన్‌కు సంబంధించి 30, మూడవ జోన్‌కు సంబంధించి రెండు, నాలుగవ జోన్‌కు సంబంధించి 12, ఐదవ జోన్‌కు సంబంధించి 72, ఆరవ జోన్‌కు సంబంధించి 10, భీమిలి జోన్‌కు సంబంధించి 14 ఫిర్యాదులందాయి. వీటిలో టౌన్‌ప్లానింగ్ విభాగంకు సంబంధించి 31, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి 14, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 41, ఇ.ఇ (పి.ఎల్ అండ్ సి) విభాగానికి సంబంధించి 4, డిప్యూటి కమిషనర్ రెవిన్యూ విభాగంకు 54, యుసిడి విభాగానికి సంబంధించి 16, ఇతరులకు సంబంధించి 68 పిర్యాదులు అందాయి.

## ప్రభుత్వ స్థలాలను కాపాడండి


**- ములగాడ తహాశీల్దార్‌కు అఖిలపక్షాలు వినతి**



సింథియా: ములగాడ మండలం పారిశ్రామికప్రాంతంలోని జీవీయంసీ 45,46,47,48,49 వార్డులలో ఉన్న విలువైన ప్రభుత్వభూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, కొండవాలు ప్రాంతంలోని భూముల కబ్జాకు గురౌతున్నాయని, ప్రభుత్వ భూములకు తగిన రక్షణ కల్పించి, కబ్జాకోరులబారినుంచి రక్షించాలని కోరుతూ పారిశ్రామికప్రాంతంలోని లోక్‌సత్తా నాయకుడు లెక్కల శ్రీనివాస్, మాజీ డిప్యూటి మేయర్ దాడిసత్యన్నారాయణ, పెదరెడ్ల నానాజీ, తదితర నాయకులు స్పందన కార్యక్రమంలో భాగంగా ములగాడ తహాశీల్దార్ రమామణికి వినతి పత్రాన్ని అందజేసారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ జీవీయంసీ 46వ వార్డులోని ఏదురువానిపాలెం, ములగాడ, జీవీయంసీ 48,49 వార్డులలోని కొండవాలు ప్రాంతంలోని ప్రభుత్వం భూములు కబ్జాలకు గురవుతున్నాయని ఆందోళనవ్యక్తం చేసారు. తక్షణమే వాటిని రక్షించాలని, తగిన రక్షణకల్పించాలని డిమాండ్ చేసారు. ఇప్పుడుకూడా కొంతమంది కబ్జాకోరులు అక్రమించుకొని లక్షలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కొండవాలు ప్రాంతాలను ఆక్రమించుకోవడం వలన కొండచర్యలు విరిగి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని. దీనిని నివారించాలని కోరారు.

గతంలో వీఆర్ఓ సంజీవ్‌కుమార్ ఆక్రమణదారులను ప్రోత్సహించి, సొమ్ముచేసుకున్నాడని, దీనిపై లోక్‌సత్తా ఆధ్వర్యంలో ఏసీబి కి ఫిర్యాదు చేయడంతో ఆయనపై దాడులు నిర్వహించగా కోట్ల రూపాయలు అక్రమార్జనగా ఏసీబీ గుర్తించిందని, అది అప్పట్లో సంచలనంగా మారిందని అన్నారు. ఇప్పటికైన తహాశీల్దార్ రమామణి స్పందించి చర్యలుతీసుకోవాలని కోరారు. స్పందించిన తహాశీల్దార్ రమామణి కబ్జాలను నివారించేందుకు చర్యలు చేపడతామని, కబ్జాకోరులు ఎంతటివారైన ఉపేక్షించేది లేదని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రం ఇచ్చినవారిలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నౌకా దళం నియామకాలకు గీతం విద్యార్థుల అనూహ్య స్పందన



సాగర్‌నగర్ : భారత నౌకా దళంలో ఉన్నత స్థాయి ఉద్యోగాల నిమిత్తం కమాండ్ రిక్రూట్‌మెంట్ టీమ్ సోమవారం నిర్వహించిన యూనివర్సిటీ ఎంట్రీ స్కీమ్ (యుఇఎస్)కు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది.గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బిటెక్ కోర్సు అభ్యసిస్తున్న దాదాపు 115 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రాథమిక అర్హత పరీక్షలకు హాజరయ్యారని ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డైరక్టర్ గురుమూర్తి గంగాధరన్ తెలిపారు. వ్యక్తిగత ఇంటర్వ్యూలు, గ్రూప్ డిష్కషన్ ద్వారా ఎంపికయిన విద్యార్థుల జాబితాను సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్‌ఎస్‌బి) జనవరి 2020 నాటికి ప్రకటిస్తుందని ఆయన పేర్కొన్నారు.

గతంలో జరిగిన ఈ తరహ నియామకాల ప్రక్రియ ద్వారా ఇద్దరు గీతం ఇంజనీరింగ్ విద్యార్థులు భారత నౌకాదళంలో ఉద్యోగాలు సాధించారని ఆయన తెలిపారు. ఈ ఏడాది పెద్ద సంఖ్యలో విద్యార్థులు నౌకాదల ఉద్యోగాలకు ఎంపిక అయ్యే అవకాశం ఉందన్నారు.

కాగా ఈ నియామకపు ప్రక్రియ నిర్వహించడానికి తూర్పు నౌకాదళం కమాండ్ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ కెప్టెన్ ఎస్.ఎస్. దాస్ నేతృత్వంలోని నౌకాదళ అధికారులు బృందం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి హజరై నౌకాదళంలో పనిచేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, యువతకు రక్షణ దళాలలో ఎదగడానికి గల అవకాశాలను వివరించారు.

## స్పందనకు విశేష స్పందన

గొలుగొండ : ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు విశేష స్పందన లభించింది. వివిధ గ్రామాల నుండి భూసమస్యలు, తాగునీటి సమస్యలు, పాఠశాలలో తెరిపించాలని ప్రజలు ఎంపిడిఒ డేవిడ్‌రాజు, తహశీల్దార్ వెంకటేశ్వరావుకు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. ప్రధానంగా గాదంపాలెం గ్రామంలో రెండు సంవత్సరాలు క్రితం పాఠశాలకు మూసివేయడంతో అక్కడ ఉన్న 13 మంది విద్యార్థులు నరకయాతన పడుతున్నారని గ్రామస్థులు సామిరెడ్డి సత్యనారాయణ, నల్లబెల్లి శ్రీనివాసరావు, అప్పారావు తెలిపారు.

# భీమిలి జోనల్ కార్యాలయం ఎ.సి.పి.గా అరుణవల్లి



భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం ఎ సి పి గా ఎం అరుణవల్లి సోమవారం బాద్యతలు చేపట్టారు. ఇక్కడ విదులు నిర్వహించిన హరిబాబు జోన్ 4 కి బదిలి పై వెళ్ళారు.

# ఫించన్ దారులకు వైద్య పరీక్షలు

భీమునిపట్నం స్థానిక ప్రభుత్వ ఫించన్ దారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫించన్ దారుల కు రాయితీ ధరలతో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సంఘం అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు టి.భీమారావు, ఎం.ఆనందరావు లు తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న సంస్థ కార్యాలయ ఆవరణలో మోడల్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 7 గంటల నుండి12గంటల వరకు నిర్వహించారు. ఇందులో 57 రకాల వైద్య పరీక్షలు నిర్వ హించారు. ఈ వైద్య పరీక్షలకు 50 మంది హాజరైనట్లు వారు తెలిపారు.

# సమస్యలపై వినతిపత్రం

భీమునిపట్నం భీమిలి డివిజన్ టిడిపి అధ్యక్షులు గంటా నూకరాజు భీమిలి జోనల్ కమీషనర్ సి.హెచ్. గోవిందరావు కి స్పందన కార్యక్రమంలో స్థానికంగా ఉన్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 20వ వార్డు, 15వ వార్డు, 16వ వార్డులలో సామాజిక భవనాలు నిర్మించారని, 20వ వార్డు బోయవీధి లో అయితే గతంలో ఉండే సామాజిక భవనంలో గ్రంధాలయం ఉండేదని అయితే 2014లో వచ్చిన హుద్ హుద్ కారణంగా ఇక్కడ ఉండే సామాజిక భవనం అంతా పాడైనది. దీనికి 25 లక్షలు మంజూరు చేసి భవనం కూడా నిర్మించారని ఈ సామాజిక భవనాలను స్థానికంగా ఉండే సామాజిక వర్గానికి కేటాయించాలని గంటా నూకరాజు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, పెంటపల్లి యోగీశ్వరావు, మారోజు సంజీవకుమార్, కనకల అప్పలనాయుడు, గిడుతురి శ్రీనివాసరావు, అప్పికొండ నూకరాజు, కె.ఎస్.ఆర్.కృష్ణారావు, రాజగిరి రమణ, దాసరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ డాన్స్ ఫెస్టివల్‌లో తిమ్మాపురం విజ్ఞాన్ విద్యాలయంకు ప్రదమస్థానం

భీమునిపట్నం: ఇండియన్ డాన్స్ ఫెస్టివల్ పేరున వివిద రాష్ట్రాలకు చెందిన విద్యార్థినులకు తిరుపతి శిల్పారామం వేదికగా బృంద నృత్య పోటీలు జరిగాయి. ఇందులో భీమిలి మండలం తిమ్మాపురం విజ్ఞాన్ విద్యాలయం కు ప్రదమస్థానం లోనిలిచారు. అందులో కూజిపూడి విబాగం లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రదర్శనకు కళాసౌరభ 2019 అవార్డును అందుకున్నారు.వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ చంద్ర, ఇడి శ్రీకాంత్,నృత్య ఉపాధ్యాయులు సుదీర్ కుమార్ లు విద్యార్దినిలను అభినందించారు. మేనేజర్ ప్రవీణ్ మాట్లాడుతూ చదువు అంటే కేవలం మార్కులే కాదు విద్యార్థులకు ఆల్ రౌండ ప్రతిభావంతులు గా తీర్చిదిద్దడమే అని అన్నారు.

## సత్యదేవుని ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆహ్వానం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి వాసుడైన శ్రీ సత్యదేవుని ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆగష్టు 1,2 తేదీలలో అత్యంత వైభవంగా జరుగుచున్నవి కావున ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా దేవస్థానం చైర్మెన్ ఐ.వి.రోహిత్ ను ఆయన అతిథి గృహములో కలసి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో వేదపండితులు ముష్టి.కామశాస్త్రి, కపిలవాయి. రామశాస్త్రి,అర్చకులు నర్సింహమూర్తి,శర్మ మరియు దేవస్థానం ఏఈవో ఎమ్.కె.టి.యన్.ప్రసాద్, టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి ఫిల్టర్ చేసి అందించాలంటూ గ్రామస్తులు వినతి

అమలాపురం: త్రాగునీటిని ఫిల్టర్ చేసి సక్రమంగా అందించాలని ఇందుపల్లి గరువు గ్రామస్తులు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసినట్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ కుడుపూడి నాగరాజు తెలిపారు.

ఈ సందర్భంగా త్రాగునీటి తాము పడుతున్న ఇబ్బందులను వినతిపత్రంలో ఎంపిడిఓ ఎం.ప్రభాకరరావు అందజేశారు. అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి గ్రామంలోని ఆర్‌డబ్ల్యుఎస్ అందించే త్రాగునీరు అందించడంలో పంచాయితీ అధికారులు విఫలమయ్యారు.

త్రాగునీటిని క్లోరినేషన్‌తోపాటు ఫిల్టర్ చేసి గ్రామంలోని ప్రజలకు అందించాలి. ఇందుపల్లి గరువు గ్రామంలోని త్రాగునీటిని సరైన రీతిలో క్లోరినేషన్ , ఫిల్టర్ చేయకుండా నీటిని కుళాయిలలోకి వదలడం వల్ల త్రాగునీరు రంగు మారిపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఫిల్టర్ వాటర్‌ను బయటి నుండి డబ్బులతో కొనుకున్ని తెచ్చుకుంటున్నారు. అలాగే అండర్ గ్రౌండ్ పైపులైన్లలో పేరుకుపోయి కిలం కట్టిన నీటిని నెలకు ఒక్కసారైనా బయటకు విడుదల చేయడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే త్రాగునీటి సమస్యను పరిష్కారినికి కృషి చేస్తామని ఎంపిడిఓ తెలిపారు. ఈ వినతిపత్రం అందజేసినవారిలో కుడుపూడి ప్రసాద్, దొమ్మేటి శ్రీనివాసరావు, కుడుపూడి రామకృష్ణ, కుడుపూడి రమణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యతను సాధించేదిశగా ప్రభుత్వం కృషి: మంత్రి అవంతీ

భీమునిపట్నం: భీమిలి మండలం, జె.వీ అగ్రహారంలో పంచాయతి భవనం ప్రారంభించారు. అనంతరం భీమిలి మున్సిపాలిటీ 17 వ వార్డ్ పరిధిలో గవర్మెంట్ హైస్కూల్ నందు ఎస్ ఎస్ సి నిధులు 17.60 లక్షలతో నిర్మించిన అదనపు భవనాలను స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర పర్యాటక శాఖ మాత్యులు ముత్తంశెట్టి. శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ విద్యను చెరువులోకి తీసుకురావడం ద్వారా రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత ను సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

మా ప్రభుత్వం మహిళా పక్షపాతం ఎందుకంటే రానున్న రోజుల్లో అన్ని రంగాల్లో కూడా మహిళలు 50% రిజర్వేషన్ కల్పించటం జరుగుతుందని ముఖ్యంగా స్థానిక యువతకు పరిశ్రమలలో 70% ఉపాధి కల్పిస్తామని అలాగే అమ్మ వాడి స్కీం ద్వారా తల్లి తండ్రుల ఖాతాలోకి ప్రతి ఏటా 15,000 రూపాయలు అందిస్తుందని ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ప్రయోజకులు అవ్వాలని తెలిపారు. మద్యాన్ని రూపుమాపేందుకు దశల వారీగా మద్య నిషేధం అమలు చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ విశ్వనాథ సన్యాసిరావు డిప్యూటీ డీ ఈ ఓ ప్రేమ్ కుమార్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జి. వెంకట్రావు. జూనియర్



కళాశాల ప్రిన్సిపల్ పి ఉమారాణి, భీమిలి జోన్ కమిషనర్ సిహెచ్ గోవిందరావు, వైసీపీ సీనియర్ నాయుకులు పెదబాబు,నాయకులు ఎస్ కరుణాకర్ రెడ్డి, బాస్కర్ రెడ్డి, జగ్గుపల్లి ప్రసాద్, వాసుపల్లి కొండబాబు,అల్లిపిల్లి నరసింగరావు, గుండాసు మధునాయుడు ,అప్పికొండ అప్పలనాయుడు, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆర్ ప్రభాకర్ నాయుడు,చెల్లూరి గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 40వ వార్షికోత్సవం పోస్టర్ విడుదల



దేవరాపల్లి: మండలంలోని కాశీపురం గ్రామంలో సియోన్ ప్రార్ధన మందిరం ప్రారంభించి 40 ఏళ్ళు గడిచిన సందర్భంగా ఆగస్టు 3 న భారీగా వార్షికోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రెవ .బిషప్ టి .టైటస్ ,గ్రేస్ తెలిపారు .ఈ సందర్బంగా వారు కాశీపురంలో సోమవారం గోడ పత్రికను విడుదల చేశారు .ఈ సందర్బంగా టైటస్ మాట్లడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ప్రభుత్వ విప్ ,మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు ,మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ,అనేక మంది దైవజ్ఞులు ,క్రైస్తువులు హాజరౌతారన్నారు .ఈ కార్యక్రమంలో 40 మంది పోస్టర్లకు బ్రదర్ .మధు ప్రకాష్ సహకారంతో మెగాఫోన్లు పంపిణి చేస్తామన్నారు .ఈ కార్యక్రమంలో రామారావు ,ప్రభు కిరణ్ ,రాంబాబు ,ప్రేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు అనకాపల్లిలో గ్రామీణ వైద్యులకు ఫస్ట్ ఎయిడ్ మరియు హోమ్ నర్సింగ్ శిక్షణ తరగతులు - సత్యనారాయణ

అనకాపల్లి: విశాఖపట్నం జిల్లా అనకాపల్లి లో స్థానిక నూకాలమ్మ గుడి ప్రక్కన శ్రీనివాస కళ్యాణ మండపం నందు విశాఖ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం గ్రామీణ వైద్య సభ్యులకు సెయింట్ జాన్ అంబులెన్స్ వారిచే ఫస్ట్ ఎయిడ్ మరియు హోమ్ నర్సింగ్ శిక్షణ తరగతులు సంఘం అధ్యక్షుడు,ఫెడరేషన్ ఆఫ్ ఫస్ట్ ఎయిడ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.సత్యనారాయణ ఆద్వర్యంలో నేడు ఉదయం 9 -00 గం.లకు ప్రారంభం అవుచున్నవి.కావున జిల్లాలోని ప్రతీ గ్రామీణ వైద్యుడు ఈ శిక్షణ తరగతులను సద్వినియోగము చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ తరగతులను హైదరాబాదు సెయింట్ జాన్ అంబులెన్స్ వారి ఆధ్వర్యంలో నలుగురు ట్యూటర్స్ ద్వారా సభ్యులకు శిక్షణను ఇస్తారని తెలిపారు.ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ ఫస్ట్ ఎయిడ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శిలు వై.నాగేశ్వరరావు, కరెళ్ళ.గణపతిరావు,కోశాధికారి సత్తారు.రాజశేఖర్



మరియు పదిలం.బెన్నబాబు,ఊటపల్లి.గోపి తదితర నాయకులు వస్తారని,శిక్షణ తరగతులు అనంతరం రాష్ట్ర ఫస్ట్ ఎయిడ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ యొక్క విధి విధానలపై చర్చ మరియు కమ్యూనిటీ పారామెడిక్స్ ట్రైనింగ్ కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైయస్.జగన్మోహన్ రెడ్డి గార్ని కలసి గ్రామీణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై విన్నవించుట తదితర అంశములపై చర్చ జరుగుతాయని తెలిపారు.

# నవరత్నాలే రాష్ట్ర సౌభాగ్యం కళాకారుల వీధి నాటకం, బుర్రకథ



కాకినాడ: రాష్ట్ర ముఖ్యంమంత్రి వైఎస్.జగన్ మోహనరెడ్డి ప్రవేశ పెట్టిప నవరత్నాలే రాష్ట్ర సౌభాగ్యానికి ప్రధాన కారణాలని పలువురు కళాకారులు పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి బుర్రకథ కళాకారులు, వీధినాటక కళాకారులు.... బుర్రకథ ,వీధినాటకం లను జిల్లా సాంస్క ృతిక మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా తమ బృందాలతో...వివరిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి చేపట్టిన నవరత్నాలతో సౌభాగ్యం ఉందని పేర్కొన్నారు.సామర్లకోట మండలం మాధవ పట్నం గ్రామానికి చెందిన పవన్ కుమార్ బృందం,రాణి ,మల్లిబాబు, ఆంజనేయులు తదితర సభ్యులు వీధి నాటకంతో అలరించగా ,దాక్షారామ గ్రామానికి చెందిన రాంబాబు బృందం బుర్రకథ వినిపించారు.

రఘు ఇంజనీరింగ్ కళాశాలలో

# నీటి సంరక్షణ కార్యక్రమం




భీమునిపట్నం: భీమిలి మండలం దాకమర్రి గ్రామంలో ఉన్న రఘు ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ జలశక్తి అభియాన్ ప్రాజెక్టు మేరకు కళాశాలలో నీటి సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ నీటి సంరక్షణ అవగాహన కార్యక్రమం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు మరియు సివిల్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్ కు ప్రొఫెసెర్ ఎం మురళి, వివరించారు. ఈ కార్యక్రమంలో నీటి సంరక్షణ, వర్షపు నీరు సేకరణ, నీరు పునర్వినియోగం, బోరు బావి నీటి ఉత్పత్తి గురించి వివరించారు. అనంతరం ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ బి ఎస్ వి రెడ్డి ఆద్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉపాధ్యాయులు సిబ్బంది బోడ మెట్ట పాలెం గ్రామంలో నీరు ఆవశ్యకతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు.. అలాగే భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జలవనరుల సంరక్షణ కార్యక్రమం నిర్వహణ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పి ఉమారాణి మాట్లాడుతూ నీటి ఆవశ్యకతను గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. అనంతరం పురవీధుల్లో ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు నీటి ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లు పి.వేణుగోపాల్ కే ప్రసాదరావు పాల్గొన్నారు.

# ట్రైసైకిళ్లను పంపిణి చేసిన జిల్లా కలెక్టర్



శ్రీకాకుళం: స్పందన కార్యక్రమంలో ఉపకరణాలను విభిన్న ప్రతిభావంతులకు జిల్లా కలెక్టర్ జె. నివాస్ పంపిణీ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి వచ్చిన వికలాంగులు గార మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన దుమ్ము యర్రయ్య మూడు చక్రాల సైకిలును ఇప్పించవలసిందిగా కోరారు.

ఎచ్చెర్ల మండలం చిలకపాలెం గ్రామం నుండి దుక్క సూర్యనారాయణ, గార మండలం అడవివరం గ్రామం నుండి ఇద్దుమల్ల దుర్గారావు, యల్.యన్.పేట మండలం కుసుమలపాడు గ్రామం నుండి భుక్క కృష్ణారావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని లెప్రసీ కాలనీ నుండి పుట్టంశెట్టి రాములమ్మ, గార మండలం యస్.మత్స్యలేశం నుండి డి.పోలమ్మలు తమకు ట్రై సైకిళ్లను ( మూడు చక్రాల సైకిలు ) మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు చేసుకున్నారు. వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జీవన్ బాబు కు ఆదేశాలు జారీచేయగా వెంటనే అధికారులు వికలాంగులకు అవసరమైన ట్రై సైకిళ్లను ఏర్పాటుచేసారు. అనంతరం జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు.

## నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,000/- విరాళం

అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి కృష్ణా జిల్లా మణికొండ గ్రామానికి చెందిన వీరంకి.శివ కోటేశ్వరరావు రూ.1,00,001/- విరాళమును ఆదివారం దేవస్థానం ఏఈవో . ఎం.కె.టి.యన్.ప్రసాద్ కు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో ఆగష్టు 14వ



తేదీన శివ కోటేశ్వరరావు,శివ వెంకట రామలక్ష్మి పేరున అన్నదానం జరించవలసిందిగా కోరారు.

# బిగ్‌బాస్ హౌసా!? బ్రోకర్ల కొంపా!?




విశాఖపట్నం : ప్రముఖ హీరో నాగార్జున బిగ్ బాస్ హౌసా.. లేక బ్రోకర్ల కొంప అన్న చందంగా పరిస్థితి ఉందని శ్వేతారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో ఇటువంటి షోలు, సినీరంగంపై జరగుతున్న కాస్టింగ్ కౌచ్లపై, గాయత్రిగుప్తా లాంటి వారు పోరాడితే కనీసం క్యాస్ కమిటీ పట్టించు కోవడంలేదని అన్నారు. సినీ పెద్దలున్న క్యాస్ కమిటీ పట్టించుకోక పోవడం వలనే పోలీస్ స్టేషన్లు కోర్టులు మెట్లు ఎక్కవలసివ స్తోందని విమర్శించారు. బిగ్ బాస్ సెలక్షన్ ప్రాసెస్లో 14 మంది ఎంపిక చేయాల్సి వుండగా 150 మంది నుండి ఎగ్రిమెంట్లు చేసుకోవడం సరికాదని అన్నారు. దీనిలో పాల్గొన వారు రెండేళ్ళవరకూ ఏ ఇతర టీవీ ఎంటర్ టైన్ మెంట్ కార్యక్రమాల్లో పాల్గొన కూడదని, ఇతర ఆంక్షలు చదవడానికి కూడా వీలులేని పరిస్థితిలో సంతకాలు తీసుకోవడం దుర్మార్గమన్నారు.తన లాంటి మహిళలందరికీ న్యాయం జరగాలని పోరాడుతున్నానని, ఈ విషయం పై హైదారాబాద్ బంజారాహిల్స్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశానని, కేసు నమోదు జరిగిందన్నారు.

మహిళా చేతన కె. పద్మ మాట్లాడుతూ బిగ్ బాస్ అనే షో ప్రజలకు అసలు పనికిమాలిన కార్యక్రమమని మండిపడ్డారు.

ఇటువంటి ఎంటర్ టైన్ మెంట్ కార్యక్రమాలతో అమాయకమైన ఆడపిల్లల జీవితాలతో ఆడుకుంటున్నవారిపై ప్రభుత్వాలు పునారావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుని, ఇటువంటి వాటిపై ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను మహిళా సంఘాల నేతలు కోరారు.

# నౌకాదళ అమ్ములపొదిలో మరో అస్త్రం

## ఎల్సీయూఎల్-56 సముద్ర ప్రవేశం
## తీర ప్రాంత భద్రతలో కీలక పాత్ర
## యుద్ధ ట్యాంకుల రవాణాలో అత్యవసర సేవలు
## వైస్ అడ్మిరల్ అతుల్ కుమార్ జైన్



విశాఖపట్నం: భారత నౌకాదళంలో మరో కొత్త నౌక వచ్చి చేరింది. ఇండియన్ నేవీలో సేవలందించేందుకు విశాఖ నేవల్ డాక్ యార్డు నుంచి ఐఎన్ ఎల్సీయూఎల్-56 సముద్రంలోకి ప్రవేశించింది. తూర్పు నౌకాదళ అధిపతి వైస్ అడ్మిరల్ అతుల్ కుమార్ జైన్ ఎల్సీయూల్-56 నౌకను ప్రారంభించారు. పోర్టు బ్లెయిర్ కమాండ్‌లో ఈ నౌక సేవలందించనుంది. తీర ప్రాంత భద్రతలో కీలకంగా పని చేయనుంది. జవాన్లు, యుద్ధ ట్యాంకులను ఒక చోటు నుంచి మరోచోటికి చేర్చడంలోను, అత్యవసర సమయాల్లో సహాయక చర్యలు అందించడంలోనూ ఎల్సీయూల్-56 సేవలను వినియోగించుకోనున్నారు.




# సాధుసంతులకు బండారా



రుషీకేశ్: షణ్మతస్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారు ఋషికేశ్ లో గల విశాఖ శ్రీ శారదా పీఠం శాఖా భవనంలో తమ పరమగురువులైన శ్రీ సచ్చిదానందేంద్ర సరస్వతీ మహాస్వామివారి ఆరాధనా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరపీఠాధిపతి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి, ఆస్థాన పండితుడు కృష్ణశర్మ, సాధుసంతులు మరియు వేదవిద్యార్థులు పాల్గొన్నారు.

అనంతరం సాధుసంతులకు బండారా (అన్నదానం) కార్యక్రమాన్ని నిర్వహించి, ఘనంగా సత్కరించారు.

### స్పందనలో మృతుని కుటుంబానికి
# ప్రమాదబీమా అందజేత
## జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ



విశాఖ క్రైం: సోమవారం విశాఖపట్నం జిల్లా పోలీసు కార్యాలయములో జిల్లా ఎస్.పి., అట్టాడ బాబూజీ స్పందన (పబ్లిక్ గ్రీవెన్స్) భాగంగా స్వయంగా భాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. సోమవారం మొత్తం 19 ఫిర్యాదులు వచ్చాయి. తక్షణ పరిష్కారం అయ్యే ఫిర్యాదులను జిల్లా ఎస్.పి., పరిశీలించి సంబంధిత అదికారులకు వాటి పరిష్కారాలకై ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 45 ఫిర్యాదులు వచ్చాయి. అనకాపల్లి, సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పోరేషన్ (CWC)లో హోమ్‌గార్డుగా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో గత 2018 మే నెలలో చనిపోయిన హోమ్‌గార్డు బి.సురేష్ కుటుంబానికి యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ రూ.115 లక్షల చెక్కును అతని భార్య తులసికి జిల్లా ఎస్.పి., అందజేశారు. ఈమే ప్రస్తుతం హోమ్‌గార్డుగా జిల్లాలో పనిచేస్తుంది. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి., అర్.పి.ఎల్. శాంతికుమార్, ఆర్మడు రీజర్వు, - కె.కె.వి. విజయనాధ్, ఇన్స్ పెక్టర్, కంట్రోల్ రూమ్ తదితరులు పాల్గొన్నారు.

# జాబిల్లికి మరింత చేరువగా చంద్రయాన్-2



శ్రీహరికోట: జాబిల్లిని చేరుకునే దిశగా చంద్రయాన్-2 వ్యోమనౌక మరో అడుగు ముందుకేసింది. ఇస్రో శాస్త్రవేత్తలు వ్యోమనౌకకు మూడోసారి కక్ష్య పెంపు విన్యాసం చేపట్టారు. అనుకున్న ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 3.12 గంటలకు విజయవంతంగా కక్ష్యను పెంచినట్లు ఇస్రో అధికారికంగా వెల్లడించింది. ఆన్‌బోర్డు ప్రొపల్షన్ వ్యవస్థను ఉపయోగించి చంద్రయాన్ 2 వాహకనౌకను 276 X 71792 కిలోమీటర్ల కక్ష్యలోకి మార్చారు. ఆన్‌బోర్డులో ఉన్న ఇంధనాన్ని 989 సెకన్ల పాటు మండించడం ద్వారా ఇది సాధ్యమైందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు.

తొలిసారిగా ఈ నెల 24న వ్యోమనౌక కక్ష్య పెంపు విన్యాసం చేపట్టారు. ఆ తర్వాత జులై 26న రెండోసారి పెంచారు. తాజా విన్యాసంతో చంద్రయాన్ 2 జాబిల్లికి మరింత చేరువైందని ఇస్రో తెలిపింది. నాలుగో కక్ష్య పెంపు ప్రక్రియను ఆగస్టు 2న మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్య చేపట్టనున్నట్లు వెల్లడించింది.

భారత అంతరిక్ష రంగ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ ఈ నెల 22న ఇస్రో చంద్రయాన్ 2 ప్రయోగాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి చంద్రయాన్ 2ను మోసుకుంటూ జీఎస్ఎల్వీ మార్క్ 3-ఎం1 నింగిలోకి దూసుకెళ్లింది. చంద్రయాన్-2లో ఆర్బిటర్, ల్యాండర్, రోవర్ అనే మూడు పరికరాలు ఉన్నాయి. వీటిలో పరిశోధనల కోసం 13 పేలోడ్స్‌ను శాస్త్రవేత్తలు అమర్చారు. ఈ ఏడాది సెప్టెంబరు 7న చంద్రుడిపై ల్యాండర్ దిగనుంది. అందులో నుంచి రోవర్ బయటకు వచ్చి 14 రోజులపాటు(ఒక లూనార్ పగలు) పరిశోధనలు జరుపుతుంది.

# రిజర్వేషన్లపై సీఎంకు ముద్రగడ లేఖ

అమరావతి: అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లలో కాపులకు 5 శాతం కోటా కుదరదన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం బహిరంగ లేఖ రాశారు. కోర్టులో కేసులు ఉన్నందున రిజర్వేషన్ల అమలు కుదరదన్నట్లు పత్రికల్లో చదివానని, అయితే ఎక్కడ స్టే ఇచ్చారో అసెంబ్లీలోగానీ, మీడియాతోగానీ చెప్పి ఉంటే సంతోషించేవాడినని అన్నారు. నిజంగా కోర్టులో స్టే ఉంటే మళ్లీ ఎన్నికల వరకు నోటికి ప్లాస్టర్ వేసుకుంటామని ముద్రగడ స్పష్టం చేశారు. మీరు ఇస్తానన్న రూ.2 వేల కోట్లకు ఆశపడి ఓట్లు వేశారని భావిస్తున్నారా?అని సీఎంను ప్రశ్నించారు. మా జాతి బానిసలుగా బతకాలని మీ అభిప్రాయమా? అంటూ లేఖలో ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# అక్రమంగా వేసిన కాంక్రీట్ బ్లాక్స్ తొలగించాలి
## ఏపీ మత్స్యకార యువజన సమాఖ్య అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్



విశాఖపట్నం: విశాఖ కంటైనర్ టెర్మినల్ వారు ఫిషింగ్ హార్బర్‌లో రోడ్డు నిర్మాణం కోసం అక్రమంగా వేసిన కాంక్రీట్ బ్లాక్స్‌ను తొలగించి మత్స్యకారులు, ప్రజల పక్షాన నిలిచినందుకు రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి మత్స్యకారులతో దీక్ష విరమింపజేసిన గంటలోనే అక్రమంగా వేసిన కాంక్రీట్ బ్లాకుల అన్ని కూడా తీయించి వేసిన జిల్లా మంత్రి అవంతి శ్రీనివాస్‌కు, ఎంపీ ఎంవివి సత్యనారాయణకు, వి యమ్ ఆర్ డి ఎం చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్‌కు మత్స్యకారుల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మత్స్యకార యువజన సమాఖ్య అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ (జానీ ) తెలిపారు.

అయితే సమస్య ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదని ఫిషింగ్ హార్బర్ లోపల విశాఖ కంటైనర్ టెర్మినల్ వారు నిర్మించిన గేటును కూడా పూర్తిగా తొలగించి ఆ స్థలం అంతటినీ కూడా మత్స్యకారులు అవసరాలకోసం వదిలి వేయాలని అప్పుడే ఈ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం చేకూరుతుందని, మంత్రి చెప్పినట్లుగా కలెక్టరేట్‌లో కలెక్టర్ సమక్షంలో జరిగే సమావేశంలో మత్స్యకారులకు న్యాయం జరిగే విధంగా ఒక మంచి నిర్ణయం తీసుకోవాలని ఆ స్థలాన్ని అంతటినీ కూడా ఫిషింగ్ హార్బర్ అవసరాలకు వదిలి వేయాలని, అప్పుడు మాత్రమే ట్రాఫిక్ సమస్యలను అధిగమించగలమని, రాష్ట్రంలో పెరుగుతున్న జనాభా దృష్టిలో ఉంచుకొని ఫిషింగ్ హార్బర్ లో స్థలాభావం లేకుండా చూడాలని. ఈ వివాదాస్పద స్థలంలో ఏదైతే ఉందో అది ఫిషింగ్ జెట్టీ కు ఆనుకుని దగ్గరలో ఉండటం వలన మత్స్యకారులు తెచ్చిన చేపల వేటను స్వచ్ఛమైన పద్ధతిలో ప్రజలకు, ఎగుమతిదారులకు అందించటానికి అవకాశం ఉంటుందని అన్నారు.

కావున ప్రజలకు, మత్స్యకారులకు బోటు ఓనరులకు, వ్యాపారస్తులకు మేలు చేకూరేలాగా ఈ స్థలమును ఫిషింగ్ హార్బర్ అవసరాలకు వదిలివేయాలని మంత్రికి, యంపీ ఎం వి వి సత్యనారాయణకి, వుడా చైర్మన్‌కి, జిల్లా కలెక్టర్‌కి, పోర్ట్ ట్రస్ట్ చైర్మన్‌కి మత్స్యకారుల తరపున అభ్యర్థిస్తున్నాం అని చెప్పి వాసుపల్లి జానకిరామ్ తెలియజేశారు .

### పంచగ్రామాల భూ సమస్య పరిష్కారానికి
# ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉంది

విశాఖపట్నం: నగరానికి చెందిన పంచ గ్రామాల భూ సమస్య ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నందున సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణులతో సూచనలు, సలహాలు తీసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పంచగ్రామాల భూ సమస్య పరిష్కార సలహా కమిటి చైర్మన్ మరియు దేవదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

పంచగ్రామాల భూ సమస్య పరిష్కారానికి వై యస్ ఆర్ సిపి ప్రభుత్వం నియమించిన సలహా కమిటీ దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస రావు అధ్యక్షతన వారి కార్యాలయం లో మొదటి సమావేశం జరిగింది.

ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి వివిధ మార్గాలను సలహా కమిటీ చర్చించి తదుపరి న్యాయ నిపుణుల సలహా, సూచనలు తీసుకోవటం జరుగుతుందన్నారు.



అనంతరం సలహా కమిటీ నివేదికను ప్రభుత్వానికి నివేదించటం ద్వారా ప్రభుత్వ నిర్ణయం తో ఎవరికి నష్టం లేకుండా ప్రజలకు సింహాచలం దేవస్థానానికి ఇబ్బంది లేకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు.

సమావేశంలో పెందుర్తి ఎమ్మెల్యే ఆదిరాజు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ మన్మోహన్ సింగ్, ఎండోమెంట్ కమిషనర్ పద్మజ, విశాఖ జిల్లా కలెక్టర్ వినయ్ చంద్, డిప్యూటీ సెక్రటరీ సూర్య నారాయణ, మరియు సింహాచలం దేవస్థానం ఈవో మరియు సలహా కమిటీ కన్వీనర్ రామ చంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రావుగోపాలరావు స్మారక నాటక పోటీలు - 2019
## బ్రోచర్‌ను ఆవిష్కరించిన మాజీ ముఖ్యమంత్రి కె. రోశయ్య



విశాఖ సిటీ: నటవిరాట్ డా॥ రావుగోపాలరావు స్మారక ఏడవ ఉభయ తెలుగు రాష్ట్ర స్థాయి ఆహ్వానం నాటక పోటీలకు సంబంధించి బ్రోచర్‌ను తమిళనాడు మాజీ గవర్నర్, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఆవిష్కరించారు. యాక్మి స్వచ్ఛంధ సేవా, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం సిరిపురంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కె. రోశయ్య ముఖ్య అతిథిగా హాజరై బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రోశయ్య మాట్లాడుతూ నాటకరంగ సమాజానికి కళాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యాక్మి వ్యవస్థాపక అధ్యక్షులు పాలమరశెట్టి ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా క్రమం తప్పకుండా డా॥ రావుగోపాలరావు పేరిట నాటక పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా గతంలో గాయకులు మంగళంపల్లి బాలకృష్ణ, సినీ దర్శకులు ఏడిద నాగేశ్వరరావు, నటులు తనికెళ్ళ భరణి, హరికథకురాలు, రావుగోపాలరావు సతీమణి కమలకుమారి, రచయిత గొల్లపూడి మారుతిరావు, నాటి హీరో ఎం.మురళీమోహన్‌లను సత్కరించామన్నారు. ఈ ఏడాదికి ప్రముఖ రంగస్థల సినీ నటులు గిరిబాబుని రావుగోపాలరావు స్మారక పురస్కారం ప్రదానం చేయునున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్, సిఎంఆర్ గ్రూప్స్ అధినేత మావూరి వెంకటరమణ, డైట్ కాలేజ్ చైర్మన్ దాడి రత్నాకర్, నాటక పరిషత్ చీఫ్ కన్వీనర్ బొడ్డేటి జగత్‌రావు, నిర్వాహకులు పి. ఆనంద్ కుమార్, పి. పరీష్ తదితరులు పాల్గొన్నారు.








Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com